


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి

రి.నెం. 119/2015

ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా

ఉచిత కళ్యాణ మండపం

స్వయం ఉపాధి శిక్షణ

ఉచిత రక్తదానము

ఉచిత న్యాయ సలహాలు

ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంప్రదించవలసిన చిరునామా

ఆవుల విజయభాస్కర రెడ్డి


ఆళ్లగడ్డ

9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 29-01-2023 సంపుటి : 04 సంచిక : 138 పేజీలు : 4 వెల : రూ 3-00


## నీరు, నెత్తురు కలిసి ప్రవహించలేవు: 'సింధూ జలాల'పై ఆనాడే హెచ్చరించిన మోదీ



భారత్ , పాకిస్థాన్ మధ్య ఆరు దశాబ్దాలుగా ఉన్న 'సింధూ జలాల ఒప్పందాన్ని (ఐడబ్ల్యూటీ)' మార్చేందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు పాక్‌కు నోటీసు కూడా జారీ చేసింది. అయితే ఈ ఒప్పందాన్ని సవరించాలన్న నిర్ణయం ఈ నాటిది కాదు. 2016లోనే మోదీ సర్కారు దీనిపై పునరాలోచన చేసినట్లు తెలుస్తోంది. ఉరిలోని సైనిక క్యాంప్‌పై ఉగ్రదాడి తర్వాత సింధూ జలాల ఒప్పంద సమీక్షలో భారత ప్రధాని మోదీ (ఓనీటతి) మాట్లాడుతూ.. "నీరు, నెత్తురు కలిసి ప్రవహించలేవు' అని అధికారులతో నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. నాటి హెచ్చరికలే ఇప్పుడు ప్రతిధ్వనిస్తున్నట్లు తాజా పరిణామాలతో స్పష్టమవుతోంది. 2016 సెప్టెంబరులో జమ్మూకశ్మీర్ లోని ఉరి సైనిక స్థావరంపై పాక్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాదులు భీకర దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 18 మంది ఆర్మీ జవాన్లు అమరులయ్యారు. ఈ ఘటన జరిగిన సరిగ్గా 11 రోజుల తర్వాత సింధూ జలాల ఒప్పందంపై కమిషనర్లు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలోనే ప్రధాని మోదీ అధికారులతో మాట్లాడుతూ ఒప్పందంపై కీలక వ్యాఖ్యలు చేశారు. నెత్తుటి చర్యలకు పాల్పడుతున్న దాయాదితో నీటిపై ఒప్పందం కొనసాగించలేమని ప్రధాని ఆనాడు సూచనప్రాయంగా వెల్లడించారు. తాజాగా ఐడబ్ల్యూటీ ఒప్పంద సవరణకు భారత్.. పాక్‌కు నోటీసులిచ్చిన వేళ నాటి మోదీ వ్యాఖ్యలు మళ్లీ తెరపైకి వచ్చాయి. ఉరి (జతీతి) ఘటన జరిగిన రెండేళ్లకు 2018 మే నెలలో ప్రధాని మోదీ బాందిపొరాలో కిషన్‌గంగా ప్రాజెక్టును మోదీ ప్రారంభించారు. దీంతో పాటు జమ్మూకశ్మీర్‌లో 1000 మెగావాట్ల పాకల్-దుల్ ప్రాజెక్టుకు కూడా శంకుస్థాపన చేశారు. అంతేగాక, ఉరి ఘటన తర్వాతే సింధూ నదీ జలాలపై ఉన్న మరో రెండు ప్రాజెక్టుల పనులు వేగవంతమయ్యాయి. భారత్‌పై ఉగ్రవాదాన్ని ప్రయోగించడంతో పాటు సింధూ జలాల ఒప్పందం విషయంలో పాక్ పాల్పడుతున్న ఉల్లంఘనలకు గట్టి సమాధానమిచ్చేందుకే మోదీ సర్కారు పలు ప్రాజెక్టులు చేపట్టింది. ఒప్పందం నిబంధనలకు లోబడి సింధూ జలాల గరిష్ఠ వినియోగించుకొనేందుకు చీనాబ్, జీలమ్ నదులపై మౌలిక వసతుల పనులను వేగవంతం చేసింది. వీటితో పాక్ ఆగడాలకు కళ్లెం వేయాలనేది కేంద్ర సర్కారు యోచన. సింధూ జలాల ఒప్పందం విషయంలో పాకిస్థాన్ మొండిగా వ్యవహరిస్తూ ఉల్లంఘనలకు పాల్పడుతుండటంతో.. భారత్ తప్పనిసరి పరిస్థితుల్లో ఒప్పంద సవరణలకు నోటీసులిచ్చింది. దీనిపై 90 రోజుల్లోగా ఇరు దేశాల మధ్య చర్చలు జరగాల్సి ఉంటుంది. అయితే, ఈ నోటీసుపై పాక్ నుంచి ఇంతవరకూ స్పందన రాలేదు.

## వరుసగా రెండోరోజూ ముఖ్యమంత్రి పర్యటన రద్దు

### హైదరాబాద్, విశాఖ వెళ్తారంటూ షెడ్యూల్.. చివరి నిమిషంలో క్యాన్సిల్



అమరావతి: ముఖ్యమంత్రి జగన్ వరుసగా రెండోరోజు కూడా తన పర్యటనలను రద్దు చేసుకున్నారు. శనివారం విశాఖ శారదాపీఠం వార్షికోత్సవాల్లో పాల్గొనేందుకు వెళ్లాల్సి ఉండగా శుక్రవారం రాత్రి ఆ పర్యటన రద్దయింది. సీఎం పర్యటన షెడ్యూల్‌ను ఆయన కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. తీరా రాత్రయ్యేసరికి అది రద్దయింది. శుక్రవారం కూడా ముఖ్యమంత్రి హైదరాబాద్, గుంటూరు జిల్లా పొన్నూరులో పర్యటించాల్సి ఉంది. గురువారం రాత్రి ఆ పర్యటననూ రద్దు చేసుకున్నారు. ముందుగా ఖరారైన పర్యటనలు చివరి నిమిషంలో.. అదీ వరుసగా రెండురోజులూ రద్దు కావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రిని కలిసేందుకు ముఖ్యమంత్రి దిల్లీకి వెళ్లే ప్రయత్నంలో ఉన్నట్లు ఆయన కార్యాలయవర్గాల సమాచారం. మరోవైపు ముఖ్యమంత్రికి సోదరుడి వరసయ్యే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ఇటీవల సీబీఐ నోటీసులు ఇచ్చింది. సీఎం జగన్ బాబాయ్, మాజీమంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో విచారణ నిమిత్తం హాజరుకావాలని సీబీఐ ఆయనను పిలిచింది. ఇదే సమయంలో సీఎం దిల్లీ పర్యటన ప్రయత్నాల్లో ఉండడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దిల్లీ పిలుపు కోసమా!: ముఖ్యమంత్రి జగన్ గత నెలాఖరులో దిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రిని కలిసి వచ్చారు. ఇప్పుడు మళ్లీ దిల్లీకి వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నారని అంటున్నారు. నేడో రేపో ప్రధాని, కేంద్ర హోంమంత్రి అపాయింట్ ఖరారవ్వచ్చన్న సమాచారం ఉన్న నేపథ్యంలోనే శుక్రవారం హైదరాబాద్, పొన్నూరు, శనివారం విశాఖ వెళ్లాల్సి ఉన్నా ఆగిపోయారని సమాచారం.

## విషమంగా తారకరత్న ఆరోగ్య పరిస్థితి: వైద్యులు

బెంగళూరు: నటుడు తారకరత్న ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని బెంగళూరు హృదయాలయ ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. ఈ మేరకు నారాయణ హృదయాలయ ఆస్పత్రి వర్గాలు తాజాగా ఆయన హెల్త్ బులిటెన్‌ను విడుదల చేశాయి. తారకరత్నకు ప్రత్యేక బృందం పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. "కార్డియాలజిస్టులు, ఇంటెన్సివిస్ట్, ఇతర స్పెషలిస్టులు తారకరత్న ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. ట్రీట్‌మెంట్ కొనసాగిస్తున్నాం" అని ఆస్పత్రి వర్గాలు ప్రకటనలో తెలిపాయి. చిత్తూరు జిల్లా కుప్పంలో 'యువగళం' పాదయాత్రలో తారకరత్న పాల్గొన్నారు. పాదయాత్రలో కొద్ది దూరం నడిచిన ఆయన అకస్మాత్తుగా సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే యువగళం సైనికులు, భద్రతా సిబ్బంది కారులో కుప్పంలోని కేసీ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం పట్టణంలోని పీఈఎస్ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యులు, కుటుంబసభ్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## సీబీఐ విచారణకు హాజరైన ఎంపీ అవినాష్‌రెడ్డి



హైదరాబాద్: కడప ఎంపీ అవినాష్‌రెడ్డి సీబీఐ విచారణకు హాజరయ్యారు. వివేకానందరెడ్డి కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డిని సాక్షిగా విచారించే క్రమంలో సీబీఐ నోటీసులు ఇచ్చింది. సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ ఆదేశాల్లో భాగంగా నోటీసులు అందుకున్న అవినాష్‌రెడ్డి శనివారం విచారణకు హాజరయ్యారు. వివేకానందరెడ్డి కేసును సీబీఐ విచారిస్తున్న క్రమంలో విచారణ పారదర్శకంగా జరగాలని అవినాష్‌రెడ్డి కోరుతున్నారు. ఈ మేరకు అవినాష్‌రెడ్డి విచారణకు హాజరయ్యారు. ఇదిలా ఉంచితే, సీబీఐకి ఎంపీ అవినాష్‌రెడ్డి ఓ లేఖ రాశారు. ఈ లేఖలో తాను విచారణకు హాజరవుతున్న విషయాన్ని స్పష్టం చేస్తూనే.. ఓ వర్గం మీడియా తనపై అసత్య కథనాలు ప్రసారం చేయడాన్ని కూడా ప్రస్తావించారు. 'వివేకానందరెడ్డి కేసు ప్రారంభమైన దగ్గరనుంచి నా ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. పనిగట్టుకుని ఓ వర్గం మీడియా లేనిపోని కథనాలను ప్రసారం చేస్తోంది. తప్పు దోవపట్టించేలా వార్తలను ప్రసారం చేస్తున్నారు. అందుకే విచారణ పారదర్శకంగా సాగాలని కోరుతున్నా" అని ఆయన లేఖలో పేర్కొన్నారు. "విచారణ సమయంలో ఆడియో, వీడియో రికార్డింగుకు అనుమతించాలి. తనతోపాటు ఒక న్యాయవాది ఉండేందుకు అనుమతి ఇవ్వాలి. ఈ విజ్ఞప్తులను సీబీఐ పరిగణలోకి తీసుకోవాలి" అని సీబీఐని ఎంపీ అవినాష్‌రెడ్డి కోరారు.

## నారా లోకేష్ పాదయాత్రపై మంత్రి అంబటి వ్యంగ్యాస్త్రాలు

గుంటూరు జిల్లా: లోకేష్‌ది యువగళం కాదు.. యువ గరళం అంటూ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. శనివారం ఆయన గుంటూరులో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టుగా లోకేష్ తీరు ఉందని దుయ్యబట్టారు. "అచ్చెన్నాయుడు మాటల తీరుపై రాష్ట్ర ప్రజలు ఛీదరించుకుంటున్నారు. పోలీసులను ఉద్దేశించి బూతులు మాట్లాడతారా?. అచ్చెన్నాయుడు బూతులు మాట్లాడటం టీడీపీ పతనానికి నాంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడే తీరు ఇదేనా?. లోకేష్‌కు అర్హత అనే మాట కూడా స్పష్టంగా పలకడం రాదు. లోకేష్ చిత్తశుద్ధిలేని పాదయాత్ర చేస్తున్నారు. చిత్తశుద్ధి లేని పాదయాత్ర మంచిది కాదు. ఇంతకీ సీఎం అభ్యర్థి ఎవరో వారికే క్లారిటీ లేదు" అని అంబటి అన్నారు. "లోకేష్ దొడ్డి దారిన మంత్రి అయ్యాడు. ఆయన యాత్ర అంతా కాలక్షేపం కోసమే. ఎంతమంది కలిసొచ్చిన జగన్నాథ రథ చక్రాల కింద నలిగిపోతారు. లోకేష్‌కు ప్రజలు తగిన సమాధానం చెబుతారు" అని మంత్రి అంబటి నిప్పులు చెరిగారు.

## సమస్యలు తెలుసుకుంటూ.. బీసీలకు భరోసానిస్తూ: రెండో రోజు లోకేశ్ పాదయాత్ర



కుప్పం: వివిధ వర్గాలను అక్కున చేర్చుకుంటూ.. విద్యార్థుల్లో జోష్ నింపుతూ.. పల్లె ప్రజల సమస్యలు తెలుసుకుంటూ.. బీసీలకు భరోసానిస్తూ తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్ర రెండో రోజు ఉత్సాహంగా సాగింది. కుప్పంలోని బీఈఎస్ వైద్యకళాశాల వద్ద నుంచి ప్రారంభమైన రెండో రోజు పాదయాత్ర పెగ్గిలిపల్లి, గణేష్‌పురం క్రాస్, కడపల్లి, కలమలదొడ్డిల మీదుగా శాంతిపురం వరకు 10 కిలోమీటర్ల మేర సాగింది. తనను కలిసిన వివిధ వర్గాల ప్రజలను ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చైతన్యపరుస్తూ నారా లోకేశ్ ముందుకు సాగారు. గుడుపల్లె మండలం బెగ్గిపల్లెలో కురబ కులస్థులతో లోకేశ్ సమావేశమయ్యారు.

రాష్ట్రంలో సామాన్యులు బతికే పరిస్థితి లేదు..

కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద లోకేశ్‌కు ఘన స్వాగతం లభించింది. విద్యార్థులు లోకేశ్ కటౌట్‌కి పాలాభిషేకం చేశారు. చంద్రబాబు తమ ప్రాంతానికి డిగ్రీ కళాశాల తెచ్చిన కృతజ్ఞతతో అభిమానం చాటుకున్నామని విద్యార్థులు తెలిపారు. జగన్ సీఎం అయ్యాక ఒక్క పరిశ్రమ కూడా ఏపీకి రాకపోగా ఉన్న పరిశ్రమలు తరలిపోయాయని ఈ సందర్భంగా లోకేశ్ విమర్శించారు. పరిశ్రమలు తరలిపోతే విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. తమ భవిష్యత్తు కోసం విద్యార్థులు యువగళంలో భాగస్వాములు అవ్వాలని లోకేశ్ పిలుపునిచ్చారు. వడ్డిపల్లి గ్రామానికి చెందిన మద్దేటి రిషికేష్, అశ్విని దంపతులు చంటి బిడ్డతో వచ్చి లోకేశ్‌ను కలిశారు. బిడ్డకు పేరు పెట్టాలని తల్లిదండ్రులు కోరగా.. సాన్విత అని లోకేశ్ సూచించారు. గణేష్‌పురం క్రాస్‌లో స్థానిక మహిళలు, రైతులతో మాట్లాడారు. నిత్యావసర సరకుల ధరలు పెరిగి బతుకుభారం అవుతుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మోటార్లకు మీటర్లు బలవంతంగా పెడుతున్నారంటూ రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. రాష్ట్రంలో సామాన్యులు బతికే పరిస్థితి లేదని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ మీటర్ల కొనుగోలులో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపించారు.

## ఫిబ్రవరి 3న స్థానిక సంస్థలకు ఎన్నికలు

విజయవాడ, జనవరి 28, (న్యూస్ పల్స్)ఏపీలో ఖాళీగా ఉన్న స్థానిక సంస్థలకు ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నారు. మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు కోఆప్టెడ్ సభ్యుల ఎన్నికకు ఏపీ ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఏపీ వ్యాప్తంగా 7 ఎంపీపీ అధ్యక్షులు, 11 ఎంపీపీ ఉపాధ్యక్షులు, 6 కోఆప్టెడ్ సభ్యుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఆ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఫిబ్రవరి 3న ఈ ఖాళీగా ఉన్న స్థానిక సంస్థలకు ఎన్నిక నిర్వహించాలని ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని తాజాగా నోటిఫికేషన్ జారీ చేశారు. వీటితో పాటు జనవరి 30వ తేదీలోగా మండల పరిషత్ ప్రత్యేక సమావేశం కోసం నోటీసు జారీ చేయాల్సిందిగా తాజా నోటిఫికేషన్?లో పేర్కొన్నారు. ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఎన్నికలు నిర్వహించాల్సిన స్థానాలు ఇవే.. అనకాపల్లి జిల్లాలోని కోటవురట్ల, ఎన్టీఆర్ జిల్లా లోని గంపలగూడెం, నెల్లూరు జిల్లాలో జలదంకి, తిరుపతిలోని చిల్లకూర్, చిత్తూరు, కర్నూలు జిల్లా మడికెరలో కో ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక జరగనుంది. వీటితో పాటు ఎస్.రాయవరం, పిడుగురాళ్ల, సంతమాగులూరు, ఆలూర్, విడపనకల్లు, చెన్నేకొత్తపల్లి మండలాల అధ్యక్షుల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ సిద్ధంగా ఉంది.



## అతను లోకేష్ కాదు.. పులకేష్: మంత్రి రోజా కౌంటర్

చిత్తూరు: టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేష్‌పై మంత్రి ఆర్కే రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. నారా లోకేష్ అడుగుపెడితే ప్రాణాలు గాల్లో కలిసిపోతాయని రోజా కీలక కామెంట్స్ చేశారు. కాగా, మంత్రి రోజా మీడియాతో మాట్లాడుతూ.. లోకేష్ పెద్ద ఐరన్ లెగ్. లోకేష్ ఎక్కడ అడుగుపెడితే ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. తారకరత్న అస్వస్థతకు గురైతే చంద్రబాబు, లోకేష్ పట్టించుకోలేదు. లోకేష్ అడుగుపెట్టాడు.. రాజమండ్రి పుష్కరాల్లో జనం చనిపోయారు. లోకేష్ పాదయాత్ర పోస్టర్ రిలీజ్ చేస్తే మరకొందరు చనిపోయారు. లోకేష్ పాదయాత్ర చేపట్టాడు తారకరత్న అస్వస్థతకు గురయ్యాడు. లోకేష్ తొలిరోజే తడబడ్డాడు.. అతను లోకేష్ కాదు.. పులకేష్ అన్నారు. తండ్రి చంద్రబాబు ఇచ్చిన ఎమ్మెల్సీ పదవి తీసుకుని లోకేష్ ఏం చేశారు. తారకరత్న త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. మహిళలను కించపరిచే తండ్రి, కొడుకులు.. మహిళల గురించే మాట్లాడే అర్హత లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మహిళలకు భద్రత పెరిగింది. మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు అని కామెంట్స్ చేశారు.



# సంపాదకీయం

ఆదివారం 29-01-2023

## రాహుల్ యాత్ర లక్ష్యం నెరవేరేనా

రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర మరి కొద్ది రోజులలో అంటే ఈ నెలాఖరుకు ముగియనుంది. కన్యాకుమారి టు కాశ్మీర్ ఆయన సాగించిన సుదీర్ఘ పాదయాత్ర ప్రజలలో ఆయన ఇమేజ్ పెరిగేందుకు దోహదపడింది. అందులో సందేహం లేదు. అలాగే కాంగ్రెస్ పార్టీలోనూ నూతనోత్సాహం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. భద్రతా సిబ్బంది ఇచ్చిన ఝలక్ మేరకు.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన భారత్ జోడో యాత్రను జమ్ముకశ్మీర్‌లో తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది. యాత్ర మార్గంలో భారీ జన సమూహాల్ని నియంత్రించడంలో భద్రతా సిబ్బంది విఫలమైంది. స్థానిక పోలీసులు సైతం మాయం అవ్వడంతో.. యాత్రను అర్థాంతరంగా ఆపేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. స్థానిక యంత్రాంగం వైఫల్యం వల్లే యాత్రను నిలిపివేయాల్సి వచ్చిందని ఆరోపణలు చేశారు. రాహుల్ గాంధీ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. తన భద్రతా సిబ్బంది ఇచ్చిన సూచనల మేరకు.. మేరకు పాదయాత్రను విరమించుకోవాల్సి వచ్చిందని తెలిపారు. కశ్మీర్ లోయకు ప్రవేశ ద్వారమైన ఖాజీగుండ్ సమీపంలో జోడో యాత్రను తాత్కాలికంగా నిలిపేసినట్లు పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి. "రాహుల్ గాంధీ బనిహాల్ టన్నెల్ దాటి ఖాజీగుండ్‌కు చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం.. దక్షిణ కశ్మీర్‌లోని వెస్సు వైపు ఆయన పాదయాత్రను ప్రారంభించారు. కానీ, బాహ్య భద్రతా వలయాన్ని నిర్వహించాల్సిన స్థానిక పోలీసులు ఒక్కసారిగా మాయం అయ్యారు. భారీ జనసమూహాలను నియంత్రించడంలోనూ లోపాలు ఉన్నట్లు తేలింది. ఇలాంటి పరిస్థితిలో పాదయాత్ర చేయడం కుదరదని రాహుల్ సెక్యూరిటీ సూచించింది. దీంతో పాదయాత్రను ఆపేసి.. రాహుల్ గాంధీ ఖానాబాల్ వద్ద ఏర్పాటు చేసిన నైట్ హాల్ట్ వేదిక వద్దకు వెళ్లారు" అని కాంగ్రెస్ నేతలు తెలిపారు. అయినంత మాత్రాన ఈ పాదయాత్ర కాంగ్రెస్ ను వచ్చే సార్వత్రిక ఎన్నికలలో అధికార పీఠంపై కూర్చోపెడుతుందా? అంటే మాత్రం కచ్చితంగా ఔను అనే సమాధానం రావడం లేదు. అందుకు కారణాలు అనేకం ఉన్నా.. ప్రధాన కారణం మాత్రం కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలలో ఉన్న నమ్మకం, విశ్వాసం ఆ పార్టీ సీనియర్ నేతలలో కనిపించకపోవడమే. అలాగే రాష్ట్రాలలో ఆ పార్టీ నాయకుల మధ్య విభేదాలు, వాటిని నియంత్రించే స్థితిలో పార్టీ అధిష్ఠానం లేకపోవడం ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. పార్టీ కొత్త అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చూపినంతగా గాంధీ కుటుంబానికి పార్టీలోని మిగిలిన నేతలు విధేయంగా లేరన్న సంగతి స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీ అధినాయకత్వం అంటే ఇప్పటికీ గాంధీ కుటుంబమే. పేరుకు మాత్రమే ఖర్గే అధ్యక్షుడు.. కానీ పార్టీ వ్యవహారాలన్నీ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల కనుసన్నలలోనే సాగుతాయన్నది బహిరంగ రహస్యమే. జాతీయ పార్టీగా కాంగ్రెస్ పునాదులు కదలడం 2014లో పరాజయంతోనే ప్రారంభమయ్యాయి. 2019 ఎన్నికల పరాజయం తో కాంగ్రెస్ సౌధం బీటలు వారడం ఆరంభమైంది. ఇప్పుడు కాంగ్రెస్ మరమ్మతులు చేపట్టింది. ఆ మరమ్మతులు పూర్తైా పార్టీకి పూర్వవైభవం రావాలంటే ఇంకా చాలా చాలా సమయం పడుతుంది. 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి బీజేపీకి దీటుగా నిలవగలుగుతుందా అంటే అనుమానమే. అయితే గత రెండు సార్వత్రిక ఎన్నికల నాటి తో పోలిస్తే చాలా చాలా మెరుగుపడుతుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారువారి విశ్లేషణలకు ఆధారంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ పాదయాత్ర సాగిన మార్గాన్నీ, తీరునూ వారు ఉదహరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ పూర్తిగా బలహీనంగా ఉన్న యూపీ, బీహార్ వంటి రాష్ట్రాలను రాహుల్ పాదయాత్ర పట్టించుకోలేదు. అలాగే పార్టీ అంతో ఇంతో బలంగా ఉన్న కేరళ, కర్నాటక, మధ్య ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాలలో మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ఎక్కువ రోజులు, ఎక్కువ కిలోమీటర్లు సాగింది. ఇక రాహుల్ గాంధీ కాంగ్రెస్ లో తిరుగులేని నేతగా.. ప్రజలలో గుర్తింపు సాధించడానికి కూడా ఈ యాత్ర దోహదపడింది. అలాగే ఈ యాత్రలో మోడీకి ప్రత్యామ్నాయం తానేనని చాటేందుకు రాహుల్ ప్రయత్నించారు. ఆ ప్రయత్నం ఫలించిందా లేదా అన్నది వచ్చే సార్వత్రిక ఎన్నికల ఫలితాల తరువాతే తేలుతుంది. కానీ ఆ దిశగా రాహుల్ ప్రయత్నమైతే చేశారు. యాత్ర ప్రారంభం నాటికి రాహుల్ లో పరిణితి చెందిన నేతను ఎవరూ చూడలేదు..కానీ యాత్ర సాగిన కొద్దీ ఆయనలో పరిపక్వతను పార్టీ శ్రేణులే కాదు, విపక్షాలు, ప్రజలూ కూడా గుర్తించాయి. అంగీకరించాయి. ఎక్కడా ఏ చిన్న అవాంతరం, అవాంఛనీయ సంఘటనా లేకుండా యాత్ర సాగడం నిజంగా రాహుల్ ఘనతే. యాత్ర సమయంలో పెరిగిన ఆయన గడ్డం.. అమృతసర్ లో కాషాయ వస్త్రధారణ.. ఆయనలో మోడీకి దీటుగా ఎదుగుతున్న నేతను ప్రజల కళ్లకు కట్టింది. ఈ యాత్ర లక్ష్యం విషయంలో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ఏ కారణం చెప్పినా.. వాస్తవం మాత్రం పార్టీకి పునర్వైభవం తీసుకువచ్చి.. మళ్లీ కేంద్రంలో అధికారంలోకి రావడమే. అయితే అందుకు రాహుల్ గాంధీ యాత్ర చాలా వరకూ దోహదం చేసిందనడంలో సందేహం లేదు. ఇక మిగిలిన పని పార్టీ రాష్ట్రాల శాఖలపై ఆధారపడి ఉంది. రాష్ట్రాలలో కాంగ్రెస్ లో విభేదాలను పరిష్కరించుకుని ఏకతాటిపైకి వస్తేనే రాహుల్ పాదయాత్ర ఫలితాలు పార్టీకి దక్కుతాయి

## కాకినాడ నుంచి చినరాజప్ప



కాకినాడ, జనవరి 28, మాజీ డిప్యూటీ సీఎం, పెద్దాపురం శాసన సభ్యుడు నిమ్మకాయల చిన రాజప్ప కాకినాడ నుంచి పోటీ చేయనున్నారనే వార్తలు షికార్లు చేస్తున్నాయి. ఈసారి టీడీపీ అధిష్టానం రాజప్పను వ్యూహాత్మకంగా కాకినాడ నుంచి పోటీ చేయించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. 60 వేలకు పైచిలుకు కాపు సామాజిక వర్గం ఉన్న కాకినాడ సిటీలో రాజప్పకు సీటు ఇస్తే కాపులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు అవుతుందనే ఆలోచనలో పార్టీ ఉంది. అంతేగాక స్థానిక శాసన సభ్యుడు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, నిమ్మకాయల చిన రాజప్పకు లోపాయి కారీ సాన్నిహిత్యం ఉన్నదనే ప్రచారం కూడా ఉంది. దీనికి కౌంటర్‌గా ఏకంగా ద్వారంపూడి మీదనే పోటీ చేయిస్తే అసలు విషయం తేలిపోతుందనే ఆలోచనలో పార్టీ ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో రాజప్పను ఈసారి కాకినాడ పంపించి తన సత్తా ఏంటో చూపించుకోమని పార్టీ ఆదేశించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. కాకినాడలో ప్రస్తుతం మాజీ శాసన సభ్యులు వనమాడి కొండబాబు ఇన్చార్జిగా ఉన్నారు. అయితే ఇక్కడ ఇప్పటి వరకూ మత్స్యకారులకు ప్రాధాన్యత ఇచ్చారు. అందులో భాగంగానే కొండబాబు సీటు దక్కించుకొన్నారు. సిటీలో 40 వేలపై చిలుకు మత్స్యకారులున్నారు. అయితే కొండబాబు తన పదవీ కాలంలో చాలా విమర్శలకు గురి అయ్యారు. పార్టీ కూడా ఆయనను మందలించిన సందర్భాలు చాలా ఉన్నాయి. అంతేగాక మేయర్ ఎన్నికల్లో కొండబాబు తీరు పార్టీకి నచ్చలేదు. దీంతో ఈసారి కొండబాబును మారుద్దామనే ఆలోచనలో పార్టీ ఉంది. అయితే మత్స్యకారుల కోటాలో వేరే నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇద్దామని అనుకొంటున్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ సిటీలో అధికశాతం ఉన్న కాపులకు ప్రాధాన్యత ఇవ్వాలనే యోచనలో పార్టీ ఉన్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే రాజప్ప పేరు తెర మీదకు తెచ్చారు. ఇక్కడి అసెంబ్లీ స్థానం నుంచి రాజప్పను పోటీ చేయించే యోచనలో ఉన్నట్లు సమాచారం. రాజప్ప కొన్ని విషయాల్లో కౌంటర్లు ఇవ్వకపోవడం పట్ల పార్టీ అనుమానం వ్యక్తం చేస్తుంది. రాజప్ప వైసీపీ వారితో వ్యాపారలావాదేవీలు పెట్టుకొంటున్నారనే అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల కాలంలో పెద్దాపురంలో కొండ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయంటూ సిటీ శాసన సభ్యుడు ద్వారం పూడి చంద్రశేఖర్ రెడ్డిని టార్గట్ చేస్తూ వనమాడి కొండబాబు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి సిటీ శాసన సభ్యులు ద్వారంపూడి స్ట్రాంగ్‌గా కౌంటర్ ఇచ్చారు. రాజప్పకు లేని అవసరం కొండబాబుకు ఎందుకు అని ప్రశ్నించారు. దీనిపై రాజప్ప స్పందిస్తారని చాలామంది ఎదురు చూశారు. కానీ రాజప్ప మౌనం వహించారు. దీంతో అందరూ ఊహించుకుంటున్నట్లే రాజప్ప, ద్వారంపూడికి వ్యాపార లావాదేవీలు ఉన్నాయా అనే అనుమానం కలిగింది. దీంతో పార్టీ అంతర్గతంగా ఇబ్బంది పడుతుంది. ఇందులో భాగంగానే వీరిద్దరి మధ్య పోటీ పెడితే అసలు విషయం తేలిపోతుందనే స్కెచ్‌లో పార్టీ ఉన్నట్లు సమాచారం. అయితే భవిష్యత్తు పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

## స్మార్ట్ హైవేలుగా జాతీయ రహదారులు

తిరుపతి, జనవరి 28, ఏపీలో జాతీయ రహదారులు త్వరలో స్మార్ట్ హైవేలుగా రూపాంతరం చెందనున్నాయి. దేశంలో జాతీయ రహదారుల వెంబడి ఆప్టికల్ ఫైబర్ కేబుల్(ఓఎఫ్‌సీ) లైన్లు వేయాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ నిర్ణయించింది. రూ.6వేల కోట్లతో 25వేల కి.మీ. మేర ఓఎఫ్‌సీ లైన్ల ఏర్పాటుకు భారీ ప్రణాళికను ఆమోదించింది. కేంద్ర ప్రభుత్వం 'గతి శక్తి ప్రాజెక్టు' కింద ఈ ప్రణాళిక రూపొందించింది. కేంద్ర టెలికాం రెగ్యులేటరీ అథారిటీ(ట్రాయ్)తో కలసి జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) స్మార్ట్ హైవేలు/డిజిటల్ హైవేల ప్రాజెక్ట్ కార్యాచరణకు ఉపక్రమించింది. మొదటగా పైలట్ ప్రాజెక్ట్ కింద ముంబై?ఢిల్లీ, హైదరాబాద్?బెంగళూరు జాతీయ రహదారులలో 2వేల కి.మీ.మేర ఓఎఫ్‌సీ లైన్ల పనులు చేపట్టనుంది. ఇందుకోసం రూ.500కోట్ల అంచనా వ్యయంతో ఇటీవల టెండర్లు పిలిచింది. అనంతరం చెన్నై?విజయవాడ, ముంబై?అహ్మదాబాద్ జాతీయ రహదారుల్లో 5వేల కి.మీ. మేర పనులు ప్రారంభించాలని నిర్ణయించింది. బహుళ ప్రయోజనకరంగా చేపట్టనున్న ఈ ప్రాజెక్టను మూడేళ్లలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. బహుళ ప్రయోజనకరంగా స్మార్ట్ హైవేల ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారు. 2050నాటికి విస్తృతం కానున్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించారు. దేశవ్యాప్తంగా 5జీ నెట్‌వర్క్‌ను విస్తరించడం ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా జాతీయ రహదారుల వెంబడి నిరంతరాయంగా 5జీ సేవలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రయాణికులకు సౌలభ్యంగా ఉండటంతోపాటు దేశవ్యాప్తంగా లాజిస్టిక్ రంగాన్ని విస్తృతం చేసేందుకు ఇది దోహదపడుతుంది. 5జీ సేవల కోసం ప్రైవేట్ టెలికాం ఆపరేటర్లు ఓఎఫ్‌సీ లైన్లు వేసేందుకు వివిధ అనుమతులు పొందేందుకు సుదీర్ఘ సమయం పడుతుంది. అందుకే జాతీయ రహదారుల వెంబడి కేంద్ర ప్రభుత్వమే డార్క్ ఫైబర్ కనెక్టివిటీని ఏర్పరచడానికి ఓఎఫ్‌సీ లైన్లు వేయాలని నిర్ణయించింది. హైవేల వెంబడి అవసరమైన చోట్ల ఓఎఫ్‌సీ లైన్లును నిర్ణీత ఫీజు చెల్లించి ప్రైవేటు టెలికాం ఆపరేటుయిుర్లు వాడుకునేందుకు ట్రాయ్ సమ్మతిస్తుంది. 'ప్లగ్ అండ్ ప్లే' విధానంలో ఓఎఫ్‌సీ లైన్లను ఉపయోగించేందుకు వీలుగా ఏర్పాటుచేస్తారు. దేశవ్యాప్తంగా త్వరలో టోల్ గేట్లను ఎత్తి వేయాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. టోల్ గేట్లు లేకుండా 5జీ నెట్‌వర్క్ సహకారంతో ఫాస్ట్ ట్యాగ్ ద్వారా టోల్ ఫీజు వసూలు చేస్తారు. అంటే ఓ వాహనం జాతీయ రహదారిపై ఎంత దూరం ప్రయాణిస్తే అంత దూరానికి మాత్రమే శాటిలైట్ ఆధారిత పరిజ్ఞానంతో ఆటోమేటిగ్గా టోల్ ఫీజు వసూలు చేసే వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం జాతీయ రహదారుల వెంబడి 5జీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. దానికి కూడా ఓఎఫ్‌సీ లైన్లు ఉపయోగపడతాయి. కూడా ఈ ఓఎఫ్‌సీ లైన్లు ఉపకరిస్తాయి. రహదారి భద్రతా చర్యల్లో భాగంగా జాతీయ రుహుదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించేయిుదుకు స్పీడ్ రాడార్లు ఏర్పాటు జాతీయ రహదారుల వెంబడి దశలవారీగా స్మార్ట్ హైవే లైటింగ్ వ్యవస్థ ఏర్పాటుకు ఓఎఫ్‌సీ లైన్లు దోహదపడతాయి.

## టీడీపీకి దగ్గరవుతున్న సీనియర్లు.... రీజన్ అదేనా

గుంటూరు, జనవరి 28, చ్చే ఎన్నికలలో విజయం సాధించి మళ్లీ గద్దె ఎక్కుతుంది వంటి ప్రశ్నలకు సాధారణంగా ఎవరైనా సర్వేల మీద ఆధారపడతారు. అయితే జనం మూడ్ ఏమిటన్నది తెలుసుకోవడానికి వారికి సర్వేలు అక్కర్లేదు. వచ్చే ఎన్నికలలో విజయం సాధించే పార్టీ ఏది? పరాజయం పాలయ్యే పార్టీ ఏది అన్న విషయం వారు అందరి కంటే ముందే పసిగట్టేయగలరు. వాళ్లే ఐఏఎస్ అధికారులు. రాజకీయ పరిభాషలో చెప్పాలంటే.. బాబూస్. అధికారంలో ఉన్న పార్టీ వచ్చే ఎన్నికలలో అధికారంలోకి వచ్చే అవకాశం లేదని చెప్పడానికి ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం పట్ల అధికారుల విధేయత స్థాయిని బట్టి ఇట్టే చెప్పేయవచ్చు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో అధికారుల తీరు గమనిస్తే రాబోయే ప్రభుత్వం ఎవరిదన్నది ఎవరికైనా ఇట్టే అర్ధమైపోతుంది. నాలుగేళ్లుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్ సర్కార్ కు అడుగులకు మడుగులొత్తిన పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఇప్పుడు సాధ్యమైనంతగా ప్రభుత్వానికి దూరం జరుగుతున్నారు. ఇంత కాలం చూసి రమ్మంటే కాల్చి వచ్చిన చందంగా ప్రభుత్వం ఇంత చెప్తే అంత చేసి విపక్షాన్ని చీకాకు పెట్టేందుకు మాత్రమే తమ అధికారాన్ని వాడిన అధికారులంతా.. ఇప్పుడు విపక్ష నేత కరుణాక్ష వీక్షణాల కోసం పడిగాపులు కాస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నాలుగేళ్లుగా జగన్ కరుణాకటాక్షాల కోసం పరిధి దాటి మరీ పనులు చేసిన కొందరు అధికారులు ఇప్పుడు చంద్రబాబు హైదరాబాద్ లో ఉన్నారని తెలుస్తే చాలు.. గప్ చిప్ గా తెలంగాణ రాజధానికి చేరుకుంటున్నారు. రహస్యంగా ఆయనతో భేటీ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నాలుగేళ్లలో తాము వ్యవహరించిన తీరుకు క్షమాపణలకు కోరుకోవడమే కాదు.. అలా ఎందుకు వ్యవహరించాల్సి వచ్చిందో వివరణ ఇస్తున్నారు. జగన్ సర్కార్ ఒత్తిడితోనే తాము తెలుగుదేవం పార్టీకి వ్యతిరేకంగా చేయాల్సి వచ్చిందని చెప్పుకుంటున్నారు. బరితెగించి మరీ ఇంత కాలం జగన్ కు భజన చేసిన అధికారులే ఇప్పుడు బాబు ప్రాపకం కోసం కాళ్లా వేళ్లా పడుతున్నారు. ఈ తీరే ఏపీలో మారిన రాజకీయ పరిస్థితులకు అద్దం పడుతోంది. చంద్రబాబు రాష్ట్రవ్యాప్త పర్యటనలు సక్సెస్ కావడం, అదే సమయంలో సీఎం జగన్ సహా, వైసీపీ చేపట్టిన కార్యక్రమాలపై జనం విముఖత చూపుతుండటం.. జగన్ సభలకే జనం కరవౌవుతున్న పరిస్థితి, గడపగడపకు లో అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రజా నిరసన ఎదురు అవుతుండటంతో అధికారులకు విషయం అర్థమైపోయింది. బాబు-పవన్ భేటీతో జగన్ కు మరో చాన్స్ అసాధ్యం అన్న స్పష్టత వచ్చేసింది. దీంతో వచ్చేది తెలుగుదేశం సర్కారేనని నిర్ధారించుకున్న అధికారులు ప్లేట్ ఫిరాయించేందుకు రెడీ అవుతున్నారు. నిబంధనల మేరకు నడుచుకున్న అధికారులు యథావిథిగా తమ ఉద్యోగ ధర్మం తాము నిర్వర్తిస్తుంటే.. పరిధి దాటి ఎక్స్ ట్రాలు చేసిన వారు మాత్రం ఇప్పుడు గాబరా పడుతున్నారు. వచ్చే ప్రభుత్వం తమపై చర్యలు తీసుకోవడం ఖాయమని భయపడుతున్నారు. అందుకే ముందుగానే తమ ఎక్స్ ట్రాలకు కారణాలను చంద్రబాబుకు వివరణ ఇచ్చుకుని కొంచెం సేఫ్ అవుదామని తాపత్రేయ పడుతున్నారు. ఇప్పటికే పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు హైదరాబాద్లో చంద్రబాబుని రహస్యంగా కలిశారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాలతో తాము అడ్డగోలు నిర్ణయాలు తీసుకోక తప్పడంలేదని చంద్రబాబు ముందు తమ గోడు వెళ్లబుచ్చుకున్నారని అంటున్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో తాము నిర్వర్తించిన విధులు, తమ ప్రతిభను గుర్తు చేస్తూ గత నాలుగేళ్లుగా తమ పనితీరు అధ్వానంగా ఉండటానికి కారణం జగన్ సర్కార్ అసమర్థతా, అనుచిత ఒత్తిడే కారణమని వివరణ ఇచ్చుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతూ.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు మొహం చాటేసిన సీనియర్ నేతలు కూడా ఇప్పుడు మళ్లీ పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేందుకు అడుగులు కదుపుతున్నారు. అవకాశం దొరికితే చంద్రబాబును కలిసి తాము ఇంత కాలం ఒకింత సైలెన్స్ మెయిన్ టైన్ చేయడానికి కారణాలను చెప్పుకుని మళ్లీ పార్టీలో పూర్వపు స్థానాన్ని పదిలపరుచుకోవడానికి ప్రయత్నాలు ఆరంభించేశారు. వీలైతే చంద్రబాబును, కుదరకపోతే లోకేష్ ను కలిసి తాము ఇకపై యాక్టివ్ గా ఉంటామని నమ్మబలుకుతున్నారు. ఇప్పుడు నారా లోకేష్ పాదయాత్ర వారికి తమ పలుకుబడిని ప్రదర్శించేందుకు ఒక అవకాశంగా లభించిదని భావిస్తున్నారు. అలాగే వివిధ కారణాల వల్ల పార్టీ మారిన వారు మళ్లీ తెలుగుదేశం గూటికి చేరేందుకు తమదైన శైలిలో, స్థాయిలో ప్రయత్నాలు ప్రారంభించేశారు

### టీడీపీకి మరోసారి భంగపాటు తప్పదు

నెల్లూరు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో ప్రారంభించిన పాదయాత్రపై మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, మాజీ మంత్రి అనీల్ కుమార్ యాదవ్ సెటైర్లు వేశారు. వైఫల్యం చెందిన వ్యక్తి చేసే పాదయాత్రే యువగళం అని మంత్రి కాకాణి అన్నారు. అలాగే ప్రజా సమస్యలు తెలియని వ్యక్తి, ప్రజలతో సంబంధం లేని వ్యక్తి లోకేష్ అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడు తన కొడుకు లోకేష్ ను చివరి అస్త్రంగా వదిలాడని, టిడిపికి మరో సారి భంగపాటు తప్పదని కాకాణి జోస్యం చెప్పారు. లోకేష్ పాదయాత్ర చూసి భయపడే పరిస్థితి వైసీపికి లేదని, ఆయన పాదయాత్రపై స్పందించాల్సి రావడం దౌర్భాగ్యమని అంటూ లోకేష్ యువగళం పాదయాత్ర కంటే చంద్రబాబు పాపపరిహార యాత్ర అంటే బాగుంటుందని కాకాణి పేర్కొన్నారు. మరో వైపు మాజీ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనీల్ కుమార్ యాదవ్ కూడా లోకేష్ పాదయాత్రపై స్పందించారు. చంద్రబాబు, లోకేష్ ది ఐరెన్ లెగ్ అని ఎద్దేవా చేశారు. నందమూరి కుటుంబం నుండి నారా కుటుంబం టిడిపి లాక్కుందని, ఆ కుటుంబాన్ని తోకలా వాడుకుంటుందని విమర్శించారు. లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న తారకరత్న అస్వస్థతకు గురైన విషయం గుర్తు చేస్తూ ఇంకెన్ని ఘోరాలు జరుగుతాయేనని అన్నారు. ఎవరెన్ని యాత్రలు చేసినా జగన్మోహన్ రెడ్డి హవాను ఆపలేరని, జనసేనతో వచ్చినా? ఒంటరిగా వచ్చినా బంగాళాఖాతంలో కలిపేస్తామన్నారు. ఫ్లూటు జింక ముందు ఊదు? జగన్ ముందు కాదు అని సినిమా డైలాగ్ ను చెప్పుకొచ్చారు.

## పేరుకే పదవీ...

### అధికారాలపై నేతల్లో ఆవేదన

విజయవాడ, జనవరి 28, పేరుకే మేం మేయరు.. డిప్యూటీ మేయరు. కార్పొరేటర్లం. మేం చెబితే వినే అధికారి లేడు. అంతా ఎమ్మెల్యేదే పెత్తనం. ఆయన చెబితేనే అధికారులు పని చేస్తారు. ఆ మాత్రం దానికి మాకు ఈ పదవులెందుకు?. అధికారానికి రాక ముందు నుంచి పార్టీ జెండాలు మోస్తున్నాం. ఇప్పటికీ అదే చాకిరీ. ఇక మేం ఎదిగేదెప్పుడు?. ఇలాగైతే మమ్మల్ని నమ్ముకున్న కార్యకర్తల్లో చులకనై పోమా !" ఓ నగరానికి చెందిన మేయర్, డిప్యూటీ మేయరు, కార్పొరేటర్ల ఆవేదన ఇది. ఇక మండల కేంద్రాల్లో జడ్పీటీసీలు, ఎంపీపీల పరిస్థితీ దీనికి భిన్నంగా ఏమీ లేదు. చివరకు రెడ్డి సామాజిక వర్గం తప్ప ఇతర మంత్రులు కూడా తమను డమ్మీలుగా మార్చేశారని వాపోతున్నారు. వైసీపీలో ఈ ఆక్రోశానికి ఎక్కడో ఒకచోట ఫుల్?స్టాప్?పెట్టకుంటే అసలుకే మోసం రావొచ్చని ఆ పార్టీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇలాంటి పెత్తందారీ పోకడలు ఇప్పుడు కొత్తగా వచ్చినవేం కాదు. గత ప్రభుత్వంలో హోంమంత్రిగా ఉన్న చినరాజప్ప కనీసం ఓ కానిస్టేబుల్?ను బదిలీ చేయలేక పోయినట్లు వార్తలొచ్చాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత హోంమంత్రిగా చేశారు. పేరుకే తాను హోంమంత్రిని అని ఆమె వాపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇంకా రెడ్డి సామాజిక వర్గం కాని మంత్రులందరూ ఇదే అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఎమ్మెల్యేల పరిస్థితీ అలాగే ఉంది. కింది స్థాయి ప్రజాప్రతినిధుల్లోనూ ఇదే వివక్ష కొనసాగుతోందని తెలిసిన వాళ్ల దగ్గర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల కార్యకర్తల్లో తమ పరువు పోతోందని వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారానికి వచ్చినప్పటి నుంచి గల్లా పెట్టె సీఎం జగన్?చేతుల్లోకి వెళ్లిపోయింది. ఆయన ఆదేశాలు లేనిదే ఏ ఒక్క పనికి నిధులు ఇచ్చేది లేదు. బిల్లులు చెల్లించేది లేదు. సీఎం చుట్టూ ఉన్న కోటరీదే పెత్తనమంతా. ప్రతీ నెలా సంక్షేమ పథకాల అమలుకు నిధుల్లేమి వెంటాడుతోంది. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని దుస్థితిని ఎదుర్కోవాల్సి వస్తోంది. దీంతో ఖజానా నిబంధనలన్నింటినీ తోసిరాజని వస్తోన్న ఆదాయం, తెస్తోన్న అప్పులు ద్వారా వచ్చే సొమ్మంతా సీఎం కనుసన్నల్లోనే వెచ్చిస్తున్నారు. ఇక మంత్రులు స్వతంత్రంగా పనులు మంజూరు చేసే అవకాశం లేకుండా పోతోంది. కనీసం చేసిన పనులకు బిల్లులు కూడా ఇప్పించలేకపోతున్నామనే ఆవేదన నెలకొంది. చివరకు తమ శాఖల పరిధిలో ఏం చెప్పాలన్నా తమకు స్వేచ్ఛ లేదనే భావనలో పడిపోయారు. ప్రస్తుతం ఉన్న మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలపై వ్యతిరేకత పెరగడానికి ఇదో కారణమైనట్లు తెలుస్తోంది. స్థానిక ప్రతినిధులపై ఎమ్మెల్యేల పెత్తనం, ఎమ్మెల్యేల నెత్తిన మంత్రులు తిష్ట వేయడం, అంతిమంగా అధికారం మొత్తం సీఎంవోలో కేంద్రీకృతం కావడం వల్లేనని పార్టీ వర్గాల్లో నెలకొంది. రానున్నదంతా ఎన్నికల సమయం. భేషజాలను వదిలేసి పై నుంచి కింది స్థాయి కార్యకర్తదాకా ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరముంది. ఇప్పుడు గత ఎన్నికలను నెగ్గినంత తేలిక్కాదు. ఇలాంటి ఆక్రోశాలకు, అసంతృప్తులకు సీఎం జగన్?ఎక్కడో ఒకచోట చెక్?పెట్టాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి.

## 200 మంది బౌన్సర్లు... 400 మంది వాలంటీర్లు

తిరుపతి, జనవరి 28, నారా లోకేశ్ పాదయాత్ర వేళ 200 మంది బౌన్సర్లను భద్రత కోసం పని చేస్తున్నారు. 400 మంది వాలంటీర్లు లోకేశ్‌ను అనుసరిస్తున్నారు. నారా లోకేశ్ పాదయాత్ర తొలి రోజు అట్టహాసంగా కొనసాగింది. కుప్పం నుంచి లోకేశ్ పాదయాత్రఇచ్ఛాపురం వరకు కొనసాగనుంది. దాదాపు 400 మంది వాలంటీర్లు లోకేశ్‌ను అనుసరిస్తున్నారు. పాదయాత్ర జరుగుతున్న సమయంలో లోకేశ్ కోసం ప్రత్యేకంగా ఒక క్యారవాన్ ఏర్పాటు చేశారు. రోజూ యాత్ర ప్రారంభం.. ముగిసిన తరువాత పార్టీ నేతలతో ఆ రోజు కార్యక్రమాలు.. ప్రణాళికలపై పార్టీ నేతలతో చర్చించేందుకు వీలుగా క్యారవాన్‌లో చిన్న సమావేశాల నిర్వహణకు వీలుగా సౌకర్యాలు కల్పించారు. అదే సమయంలో రూట్ మ్యాప్‌కు అనుగుణంగా జిల్లాల పోలీసు అధికారులు ఎక్కడికి అక్కడ లోకేశ్ యాత్రకు బందో బస్తు కల్పించనున్నారు. రాజకీయంగా సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించిన చోట ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. లోకేశ్ యాత్రలో రోడ్ షో లు.. సభలకు సంబంధించి జిల్లా స్థాయిలోనే అధికారులు నిర్ణయాలు తీసుకుంటారు. లోకేశ్ పాదయాత్ర జరగనున్న 400 రోజులు ఆయన వెంట 400 మంది వాలంటీర్లు ఫాలో అవుతారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఎంపిక చేసిన వారిని వాలంటీర్లుగా నియమించారు. వీరు రోజూ యాత్ర ముగిసిన తరువాత లోకేశ్ బస చేసే ప్రాంతంలో ప్రత్యేకంగా జర్మన్ షెడ్లు వేసి మంచాలను అందుబాటులో ఉంచారు. అక్కడే వారికి భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడా ఎటువంటి లోటు రాకుండా వారిని స్థానిక నాయకత్వం చూసుకోనుంది. వారి బాధ్యతలను అన్ని జిల్లాల్లో తెలుగు యువత నాయకత్వానికి అప్పగించారు. లోకేశ్ యాత్రతో కొనసాగటంతో పాటుగా రాకీయంగా ఏమైనా అనుకోని ఘటనలు ఎదురైన సమయంలో వీరు లోకేశ్‌కు రక్షణగా నిలుస్తారు.

## మిడ్ డే మీల్స్ లో న్యూట్రింట్ ఫుడ్....

నెల్లూరు, జనవరి 28, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పేరుతో పోషక విలువలతో కూడిన భోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకున్నప్పుడే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి చదువులో కూడా రాణిస్తారనే ఉద్దేశంతో రోజుకో మెనూతో విద్యార్థులకు గోరుముద్దను అమలు చేస్తోంది. ఈ కొత్త మెనూను ఈ నెల 12 నుంచి జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. గతంకంటే రెట్టింపు ఉత్సాహంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తింటున్నారు. ఇటీవలే వంట ఏజెన్సీలకు కూడా ప్రభుత్వం బిల్లులు పెంచింది. దీంతో విద్యా ర్థులతోపాటు ఏజెన్సీల నిర్వాహకులు కూడా ఉత్సాహంగా ఉన్నారు. అలాగే గతంలో నెలకు మూడు సార్లు కోడిగుడ్లను సరఫరా చేసేవారు. దీంతో కొన్ని చోట్ల గుడ్లు చెడిపోయేవి. ఫలితంగా విద్యార్థులు తినేందుకు ఇబ్బందులు పడేవారు. దానిని కూడా గమనించిన ప్రభుత్వం వాటికి చెక్ పెడుతూ నెలకు నాలుగు సార్లు గుడ్ల సరఫరాకు చర్యలు తీసుకుంది. దీంతోపాటు ఏ వారంలో ఏ రంగు ఉన్న గుడ్లను వాడాలో కూడా గుడ్లపై స్టాంప్‌ను ముద్రించి సరఫరా చేస్తున్నారు. జిల్లాలోని 2,048 పాఠశాలల్లో 1,48,804 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. అందులో 1621 ప్రాథమిక పాఠశాలల్లో 77,357 మంది, 171 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 43,611 మంది, 256 ఉన్నత పాఠశాలల్లో 27,836 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్క విద్యార్థికి రూ. 5.45, ప్రాథమికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. రూ.8.17 ఇస్తున్నారు. దీంతో మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగనన్న గోరుముద్దలో భాగంగా మధ్యాహ్న భోజనం పథకంపై పిల్లల నుంచి ఎప్పటికప్పుడు విద్యాశాఖ అభిప్రాయాలు సేకరిస్తోంది.

# వైజాగ్ కేరాఫ్ మత్తు

విశాఖపట్టణం, జనవరి 28, ఉడ్తా వైజాగ్..! ప్రశాంతతకు మారుపేరైన విశాఖ నగరం.. మత్తుకు కేరాఫ్ అవుతోందా.. మత్తుమాఫియా చేతుల్లో వెళ్ళిపోతోందా?? నార్కోటిక్స్ డ్రగ్స్, మత్తు ఇంజక్షన్లు- టాబ్లెట్ల వినియోగం ఆ రేంజ్‌లో ఉందిక్కడ. గతేడాది 252 కేసుల్లో 598 మంది అరెస్టయితే.. ఈ ఏడాది అంతకుమించి అన్నట్టుంది సిట్యువేషన్. 10 రోజుల గ్యాప్‌లో మూడు చోట్ల మత్తు ఇంజక్షన్లు పట్టుపడ్డాయ్. విద్యార్థులే టార్గెట్‌గా తెగబడుతున్నాయ్ మత్తుముఠాలు. ఒడిస్సా, వెస్ట్ బెంగాల్ నుంచి దిగుమతవుతున్న మత్తు టాబ్లెట్లు, డ్రగ్స్ ఇక్కడి యువతను చిత్తు చేస్తున్నాయి. మొన్న యాదవ జగ్గరాజుపేటలో మత్తు ముఠా ఆట కట్టించింది ౹ాఇః.తాజాగా జలారిపేటలో 495 మత్తు ఇంజక్షన్లు దొరికాయి. చిత్తు కాగితాలు, చెత్త వ్యాపారం మాటున సాగిన దువ్వాడ రైల్వే స్టేషన్, తుంగ్లంకు వెళ్లే ప్రధాన రహదారిలో జరిగిన మత్తు దందాను మర్చిపోకముందే.. ఓపెన్ మార్కెట్లో ఇలా నడిరోడ్డుపైనే మత్తు ఇంజక్షన్లు అమ్ముడవడం షాకిస్తోంది. జంక్షన్ దగ్గర రెడ్ హ్యాండెడ్‌గా 94 మత్తు ఇంజక్షన్లు ౹ాఇః అధికారులకు దొరికాయి. విజయనగరం జిల్లా దేశపాత్రునిపాలెంకు చెందిన చందు, పెందుర్తికి చెందిన కళ్యాణ్ సాయి, భీమిలికి చెందిన రాఘవరావు అరెస్టయ్యారు. ఇప్పుడు జాలారిపేటలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 490 పెంటా జోసైన్ లాక్టేట్ ఇంజక్షన్లను సీజ్ చేశారు. కీలక నిందితుడు పూర్ణ మార్కెట్ మహేష్ పోలీసుల అదుపులో ఉన్నాడు. ఇలా మూడు ఇంజక్షన్లు, ఆరు సిరంజిలుగా సాగిపోతోంది మత్తు దందా. ఈ సందర్భంగా విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, వెస్ట్ బెంగాల్‌లో ఒక్కో ఇంజక్షన్ ధర 30 రూపాయలు. అక్కడ కొనుగోలు చేసి విశాఖలో విద్యార్థులకు 300 రూపాయలకు అమ్ముకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కొన్ని వాట్సాప్ గ్రూపులు, కోడ్ లాంగ్వేజ్ కూడా ఉన్నాయంటూ ఆయన చెప్పుకొచ్చారు.'ఒకవైపు మత్తు ఇంజక్షన్ల కలకలం రేగితే.. గంటల వ్యవధిలోనే వన్ టౌన్లో నల్ల మందు పోలీసుల్ని పరుగులు పెట్టించింది. కంచర వీధిలో టాస్క్ ఫోర్స్ తనిఖీల్లో కిలో నల్లమందును సీజ్ చేశారు.

ఈ నల్లమందు ఒరిజినల్ కేరాఫ్ చత్తీస్‌ఘడ్. అక్కడినుంచి దిగుమతై కిలో నాలుగు లక్షలకు హైదరాబాద్‌లో అమ్మేలా ప్లాన్ జరిగిందని' జగ్గరాజుపేట గ్రామస్తులు తెలిపారు.మరోవైపు డాక్టర్ పివి సుధాకర్ మాట్లాడుతూ.. మత్తు జోలికి వెళ్లకుండా యువతను ఆదుకునే ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. మత్తుకి బానిసైన యువత నేరగాళ్లుగా కూడా మారి ఇళ్లల్లోనూ దాడులు చేసే పరిస్థితి వస్తుదనేది నిపుణులు చేస్తున్న హెచ్చరికని గుర్తు చేశారుడ్రగ్స్ కేసుల్లో.. మూలాలపై కూపీ తాగుతున్నారు విశాఖ పోలీసులు. అంతరాష్ట్ర పోలీసుల కోఆపరేషన్‌తో డ్రగ్స్ మాఫియాపై యుద్ధం ప్రకటించామంటున్నారు. మరి.. ఈ యుద్ధం ఎంతవరకు విజయవంతం అవుతుంది. ఉడ్‌తా వైజాగ్ అనే మత్తు మచ్చ నుంచి విశాఖ నగరం ఎప్పటికి బైటపడుతుందో చూడాలి మరి.

# పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో తెలుసా



**దేవినేని అవినాష్**

విజయవాడ తూర్పు నియోజకవర్గ వైకాపా ఇంచార్జ్ దేవినేని అవినాష్ మీడియాతో మాట్లాడారు. నారా లోకేష్ పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో ఆయనకు అయిన తెలుసా. పాదయాత్ర చేసేది ప్రజలను మోసం చేయటానికా,టీడీపీ ని అధికారంలోకి తీసుకు రావటానికా,నువ్వు ఈ సారైనా ఎం.ఎల్.ఏ గా గెలవటానికా అనే విషయం స్పష్టం గా చెప్పాలి. అబద్ధాలు,అసత్యాలు ప్రచారం చేసి అధికారంలోకి రావాలనే కుట్రతో పాదయాత్ర చేస్తున్నారు. టీడీపీ ఐదు సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు యువత,విద్యార్థులు కోసం ఏం చేశారో చెప్పాలి. మ్యానిఫెస్టోలో అంశాలు కూడా నెరవేర్చలేకపోయారు. స్కాలర్ షిప్ లు,నిరుద్యోగ భృతి అని డబ్బా కొట్టుకొని అవి కూడా సక్రమంగా అమలు చేయలేకపోయారు. జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్నారు. సంక్షేమ పథకాలు అందాలంటే వారికి కమిషన్లు ఇవ్వాలి,వారు పెట్టిన షరతులు పాఠించాల్సిన పరిస్థితి ఉండేది. టీడీపీ హయాంలో చేసిందే నిజమైన సైకో పాలన అని నారా లోకేష్ గ్రహించాలి. లోకేష్ ప్రభుత్వాన్ని అడుగుతున్న ప్రశ్నలు కి ప్రజలే సమాధానం చెబుతారు. 2లక్షలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిన ఘనత జగన్ సొంతం. నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్న బిల్డప్ చూస్తుంటే ఇతనే రాష్ట్రంలో తొలిసారి పాదయాత్ర చేస్తున్నట్లుగా ప్రచారం చేస్తున్నారు. పాదయాత్ర అనేది ప్రజల కష్టాలు,వారి సమస్యలు తీర్చే విధంగా ఉండాలి. జగన్ ప్రజల సమస్యలు తెలుసుకొని అధికారంలోకి వచ్చాడు కాబట్టే దేశంలో ఏ పాదయాత్ర కు రాని గుర్తింపు వచ్చింది. పాదయాత్ర లకు బ్రాండ్ అంబాసిడర్ కుటుంబం వై.యస్.కుటంబానిదే అని గుర్తునీచుకోవాలి. లోకేష్ తన అనుకూల మీడియాలో వచ్చిందో నిజమనుకున్న భ్రమలో ఉన్నాడు,,పాదయాత్ర లో ప్రజలను కలిస్తే వాస్తవాలు తెలుసుకొని తోక ముడవటం ఖాయం. లోకేష్ పాదయాత్ర లో నాడు నేడు స్కూల్స్,,జగనన్న కాలనీలు,, అనేక ప్రాంతాల్లోజరిగిన అభివృద్ధి పనులు చూడటానికి ఆయనకు ఇదొక అవకాశం. లోకేష్ పాదయాత్ర చేస్తే అమాయకపు ప్రజల ప్రాణాలు ఎక్కడో పోతాయో అని భయమేస్తోంది,ఎన్ని కుటుంబాలు రోడ్డున పడతాయో, ఎంతమంది పిల్లలు తమ తల్లిదండ్రులు ని కోల్పోతారో అని భయమేస్తోంది. లోకేష్ ప్రసంగాలు కి,ఆయన అనుకులా మీడియా ప్రచారాలకు తమ పార్టీ కార్యకర్త కూడా భయపడరు. యువగళం పేరు కూడా మీ పార్టీలోని చిన్న స్థాయి వ్యక్తి నుంచి బలవంతంగా లాక్కొన్నారు. జగన్ పాదయాత్ర తో లోకేష్ పాదయాత్ర ని పోల్చటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. జగన్ ని సింగిల్ గా ఎదుర్కొనే దమ్ములేక గుంపులు గుంపులుగా వస్తున్నారు. 175 నియోజకవర్గ ల్లో ఎవరినైనా ఎదుర్కొనే దమ్ము జగన్ కి ఉంది. ప్రజల ఆశీర్వాదలు జగన్ కు ఉన్నాయని అన్నారు.

## చిక్కవరం ఆలయంలో రథసప్తమి

విజయవాడ కృష్ణాజిల్లాలో మరో అరసవల్లి సూర్యనారాయణ స్వామి విరాజిల్లుతున్న కృష్ణాజిల్లా గన్నవరం మండలం చిక్కవరం ఆరోగ్య ప్రదాత శ్రీ ఉషా పద్మని సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో సూర్య కిరణాలు స్వామి వారి పాదాలను తాకాయి. దేశంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీకాకుళం , కోణార్క్ సూర్యానారాయణ స్వామి ఆలయాలు తర్వాత అంతటి ప్రసిద్ధి గాంచిన కృష్ణాజిల్లా చిక్కవరం ఉషా పద్మిని సమేత సూర్యనారాయణ దేవస్థానం.. రధసప్తమి పండుగ పురస్కరించుకుని సూర్యకిరణాలు స్వామి వారి పాదాలు తాకాయి. చిక్కవరం దేవస్థానం విశేషం తెలుసుకునే స్వామి వారిని దర్శించుకునేందుకు వివిధ రాష్ట్రాలతో పాటు హైదరాబాద్ విజయవాడ చుట్టుపక్కల ప్రక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి దర్శించుకుని తన్మయత్వం పొందారు. ప్రధాన అర్చకులు వంశీ ఆధ్వర్యంలో తెల్లవారుజామున నుంచే మూలమూర్తలకు పంచామృతవిశేష అభిషేకం , మూలమూర్తలకు కిరణోత్సవం , సూర్య నమస్కారాలు ,అరుణ పారాయణం , ఏకకాలంలో సూర్య హోమం , శాంతి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం భక్తలకు అన్న సమారధన నిర్వహించారు. సూర్య కిరణాల దర్శనం కోసం తెల్లవారుజామున 5 గంటల నుంచే పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అలయ నిర్మాణ దాత ముక్కామల పండుమ్మ దగ్గరండి భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. రధసప్తమి రోజున స్వామి వారి ని దర్శించుకుంటే భక్తులకు సంపూర్ణ ఆరోగ్యం , రైతులకు పాడి పంటలు సమృద్ధి పండుతాయని ఆర్చకులు తెలిపారు. రధసప్తమి రోజు స్వామి వారి పాదలు తాకిన సూర్య కిరణాలు దర్శనం తమకెంతో ఆధ్యాత్మిక భావాన్ని కలిగించాయని భక్తులు చెబుతున్నారు...

## తిరుమలలో సూర్యజయంతి వేడుకలు

తిరుమల సూర్యజయంతి వేడుకలు తిరుమలలో వేడుకగా సాగుతున్నాయి.శ్రీ మలయప్ప స్వామి వారి వాహన సేవలలోనే అత్యంత ప్రధానమైన గరుడవాహనం. రథ సప్తమి వేడుకల్లో మూడవ వాహనంగా గరుడాళ్వార్ పై అధిరోహించిన మలయప్పస్వామి నాలుగు మాడా వీధులలో ఊరేగుతు భక్తులకు దర్శనమిచ్చారు. వజ్రవైడూర్యాల ధగధగలతో శ్రీనివాసుడు తిరువీధులలో దేదీప్యమానంగా వెలుగొందాడు. స్వామి వారికి ప్రధాన వాహనం గరుడుడు. అందుకే గరుడిని ప్రథమ భక్తుడని కూడా అంటారు. గరుడ వాహనం పై ఊరేగే స్వామి దర్శనం ఎంతో మంగళకరం, శుభప్రదం....ఆశేష సంఖ్యలో హాజరైన భక్తుల గోవిందనామస్మరణల మధ్య శ్రీవారి గరుడవాహన సేవ వైభవోపేతంగా సాగింది.

## పద్మశ్రీ చంద్రశేఖర్ కు సత్కారం

కాకినాడ లక్షలాది మందికి ఉచితంగా నేత్ర చికిత్సలు అందించి వారిలో వెలుగులు నింపిన పద్మశ్రీ అవార్డు గ్రహీత సంకురాత్రి చంద్రశేఖర్ ను అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కిరణ్ కంటి ఆస్పత్రిలో జరిగిన సత్కార కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ అవార్డు రావడం గర్వకారణం అన్నారు. అదేవిధంగా శారదా విద్యాలయం ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దుతున్నారని డాక్టర్ అడ్డాల తెలిపారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ పద్మశ్రీ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్ ,ఎస్. శ్రీ నగేష్, డాక్టర్ శిరీష, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, అడబాల సత్యనారాయణ, బుద్ధ రాజు సత్యనారాయణ రాజు ,ఓం నమశ్శివాయ, రేలంగి బాపిరాజు, పి. పార్థసారథి, రాఘవరావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ , సీట్ బెల్టులు ధరించండి

ప్రాణాలు కాపాడుకోండి

స్పెషల్ డ్రైవ్ లో 357 కేసులు

జిల్లా ఎస్పీ కే.కే.ఎన్ అన్బురాజన్

కడప క్రైం హెల్మెట్ , సీటు బెల్టు ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ కే.కే.ఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. హెల్మెట్ , సీటు బెల్టు ధరించడం వల్ల విలువైన ప్రాణాలను సురక్షితం గా ఉంచుకోవచ్చున్నారు. జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ పై పత్రికా ప్రకటన విడుదల చేశారు. గ్రామాల సందర్శన సమయంలో నిర్వహించే గ్రామ సభల్లో ఫ్యాక్షన్, మట్కా, సైబర్ నేరాలు తదితర అంశాలుతో పాటు రోడ్డు భద్రతపై ప్రజలను చైతన్యం చేస్తున్నట్టు జిల్లా ఎస్.పి తెలిపారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో పక్కాగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి... కార్లు, జీపులు నడిపే వారు తప్పనిసరిగా సీటు బెల్టు వేసుకోవాలని ఎస్.పి తెలిపారు. వేగ నియంత్రణ... మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు... మొబైల్ మాట్లాడుకుంటూ డ్రైవ్ చేయకుండా జాగ్రత్తలు...ఓవర్ లోడింగ్ తో వెళ్లే ఆటోలపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

# కన్నా... కూల్ అయినట్టేనా



విజయవాడ, జనవరి 28,బీజేపీ సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణ విషయంపై పార్టీ అధిష్ఠానం దృష్టి పెట్టినట్టు కనిపిస్తోంది. పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ శివప్రకాష్, కన్నా లక్ష్మీనారా?యణ సమావేశం ఆసక్తిని కలిగిస్తోంది. సుమారు రెండున్నర గంటల పాటు సాగిందీ సమావేశం. ఏకాంతంగా వాళ్లిద్దరూ ఏం మాట్లాడుకున్నారు. నెక్ట్స్ ఏం జరగబోతుందనే ఉత్కంఠ పార్టీ నాయకులతోపాటు కన్నా లక్ష్మీనారాయణ అనుచరుల్లో కూడా కనిపిస్తోంది. కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్ బీజేపీలో అధ్యక్షుడు సోమువీర్రాజు వర్సెస్ కన్నా లక్ష్మీనారాయణ నడుస్తోంది. కన్నా వర్గాన్ని పూర్తిగా పట్టించుకోకుండా సోమువీర్రాజు ఏకపక్షంగా కార్యక్రమాలు చేసుకొని వెళ్లిపోతున్నారని ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. వీటికి సపోర్టివ్‌గా ఈ మధ్య కన్నా లక్ష్మీనారాయణ చేసిన కామెంట్స్ కూడా కాక రేపాయి. నేరుగా ఏపీ బీజేపీ అధ్యక్షుడిని టార్గెట్ చేసుకొని సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడటంతో పార్టీలో ఒక్కసారిగా కలకలం రేగింది. అదే టైంలో ఇతర పార్టీల నేతలతో కన్నా లక్ష్మీనారాయణ వరుసగా భేటీ కావడంతో ఆయన పార్టీ మారుతున్నారనే పుకార్లు కూడా షికారు చేశాయి. ఈ మధ్య ఆయన అనుచరులు కూడా కొందరు రాజీనామా చేశారు. దీంతో కన్నా పార్టీ మార్పు ఖాయం అనుకున్నారంతా. కానీ ఇంతలో అధిష్ఠానం నుంచి వచ్చిన దూత కన్నాతో సమావేశం కావడం స్టోరీలో ట్విస్ట్‌లానే చెప్పవచ్చు. కన్నా లక్ష్మీనారాయణ నేరుగా సోమువీర్రాజుపై ప్రశ్నలు సంధించడంతోపాటు ఈ మధ్య కాలంలో ఏర్పాటు చేసిన కీలకమైన రెండు సమావేశాలకు హాజరుకాలేదు. ఢిల్లీలో జరిగిన జాతీయ కార్యవర్గం భేటీకి, భీమవరంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గం భేటీకి రెండింటికీ కూడా కన్నా లక్ష్మీ నారాయణ డుమ్మా కొట్టారు. వ్యక్తిగత కారణాలతోనే ఈ రెండు సమావేశాలకు హాజరుకాలేదని ఆయన చెప్పుకుంటూ వచ్చారు కానీ... ఏదో జరుగుతోందని మాత్రం పార్టీ అధిష్ఠానం గ్రహించించి. అందుకే శివప్రకాష్‌ను పంపించిన చర్చించినట్టు తెలుస్తోంది. రాత్రి విజయవాడలో కన్నా లక్ష్మీనారాయణ, శివప్రకాష్ సమావేశం జరిగింది. సుమారు రెండున్నర గంటలపాటు సాగిందీ భేటీ. ఇందులో చాలా? విషయాలు చర్చించినట్టు సమాచారం. ఈ భేటీ తర్వాత బయటకు వచ్చిన కన్నా లక్ష్మీనారాయణ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ చాలా విషయాలపై క్లారిటీ ఇచ్చారు. తాను ఎప్పుడూ పార్టీ మారతానని చెప్పలేదన్నారు కన్నా లక్ష్మీనారాయణ. తనకి ఉన్న స్నేహం కారణంగానే కొందరు నేతలతో కలవడం జరిగిందన్నారు. ముఖ్యంగా నాదెండ్ల మనోహర్‌తో సమావేశం స్నేహపూర్వక భేటీగా చెప్పుకొచ్చారు కన్నా. అంతే కానీ పార్టీ మారుతున్నట్టు వస్తున్న ప్రచారాన్ని ఖండించారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి సూచనలు అడిగేందుకే తనను శివప్రకాష్ కలిశారే తప్ప ఎలాంటి బుజ్జగింపులు కూడా జరగలేదన్నారు. పార్టీలో కొందరు రాజీనామా చేసిన విషయాలపై కూడా కన్నా లక్ష్మీనారాయణ స్పందించారు. చాలా మంది అవమానాలు తట్టుకోలేక రాజీనామా చేస్తున్నారని అన్నారు. అన్నింటిపై కూడా చర్చించినట్టు తెలుస్తోంది. అధిష్ఠానం నుంచి కన్నాకు ఎలాంటి భరోసా వచ్చింది. ఆయన నెక్ట్స్ ఎలాంటి స్టెప్ తీసుకోనున్నారనే ఉత్కంఠ మాత్రం కొనసాగుతోంది. ఇంతీకీ ఆయన శాంతించారా లేకుంటే మళ్లీ ఏదైనా వైల్డ్ నిర్ణయం తీసుకుంటారా అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాలి.

# అచ్చెన్నపై కేసు

తిరుపతి, జనవరి 28, (న్యూస్ పల్స్) కుప్పం సభలో రెచ్చగొట్టేలా మాట్లాడారంటూ అచ్చెన్నాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శు బహిరంగ సభలో ప్రసంగించిన అచ్చెన్నాయుడు... పోలీసుల్ని ఉద్దేశిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారని.. పోలీసుల మనోభావాలు, ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసేలా మాట్లాడారంటూ కుప్పం ఒన్ టౌన్ ఎస్సై రవి కుమార్ ఈ మేరకు కుప్పం పోలీసు స్టేషన్ లో అచ్చెన్నాయుడు పైన కేసు నమోదు చేశారు. పాదయాత్ర భద్రతకు ఐదు వందల మంది వచ్చారని అయినా వారు తినడానికే వచ్చినట్లుగా వ్యవహరించారు కానీ.. ఎవరూ విధులు నిర్వహించలేదని భద్రత కల్పించలేదని అచ్చెన్నాయుడు మండిపడ్డారు. అచ్చెన్నాయుడు వ్యాఖ్యలపై మాజీ మంత్రి పేర్ని నాని బహిరంగసభ అయిపోయిన తర్వాత విమర్శలు గుప్పించారు. పోలీస్ గన్‌మెన్ల భద్రతతో బతికే వీరు.. పోలీసుల గురించి ఇంత అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారు.. పోలీసులను కించపరుస్తూ.. నిర్లజ్జగా మాట్లాడే వారిని ఏమనాలి? అని మాజీ మంత్రి పేర్ని నాని ప్రశ్నించారు. ఇటువంటి వారు ఆ పార్టీ అధ్యక్షులు అయితే.. ఆ పార్టీ అధికారంలోకి వస్తే ఎలా ఉంటుందో ఇప్పుడే చూపిస్తున్నారని ఫైర్ అయ్యారు. ఎక్కువ తక్కువ మాట్లాడితే.. మీ తొలు ఒలిచి.. పోలీసులకు 'షూ' తయారు చేయిస్తానని పేర్ని నాని ఘటు వ్యాఖ్యలు చేశారు మాజీ మంత్రి ఘాటు విమర్శలు చేసిన తర్వాత రోజే .. ఎస్ఐ రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అచ్చెన్నాయుడిపై కేసు నమోదు చేయడాన్ని మంత్రి అప్పలరాజు సమర్థించారు. అచ్చెన్నాయుడు సిక్కోలు వాసి అయి ఉండి.. పోలీసులపై అలా మాట్లాడటం బాధకలిగించిందన్న ఆయన.. పోలీసులు సరిగ్గా గమనిస్తే అచ్చెన్నాయుడు పిర్రలు పగలగొట్టొచ్చని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో అచ్చెన్నాయుడును ప్రజలే మట్టి కరిపిస్తారని హెచ్చరించారు. గతంలోనూ పోలీసులుపై ఇలాంటి వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. పోలీసులపై అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలను వైఎస్ఆర్‌సీపీ నేతలు, మంత్రులు ఖండించారు. కుప్పం నియోజకవర్గంలో పోలీసుల తీరుపై టీడీపీ నేతలు మొదటి నుంచి ఆరోపణలు చేస్తున్నారు. గతంలో చంద్రబాబు పర్యటించినప్పుడు వైఎస్ఆర్సీపీ నేతలు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఘర్షణలు జరిగాయి.అయితే ఎక్కువగా తెలుగుదేశం పార్టీ నేతలపైనే కేసులు పెట్టి చాలా కాలం పాటు జైల్లో ఉంచారు. ఆ సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు కూడా పోలీసుల తీరుపై మండిపడ్డారు. బాధితులపై కేసులు పెడుతున్న పోలీసుల్ని వదిలి పెట్టబోమని హెచ్చరించారు. ఇప్పుడు నేరుగా టీడీపీ ఏపీ అధ్యక్షుడిపై ఓ పోలీసు అధికారే ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయడం... చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పోలీసులు పాదయాత్రకు అనుమతులు పూర్తి స్థాయిలో ఇవ్వడం లేదని.. రకరకాల ఆంక్షలు పెడుతున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులపై అచ్చెన్న చేసిన వ్యాఖ్యలు రాజకీయంగానూ కలకలం రేపుతున్నాయి. కేసు కూడా నమోదు చేయడంతో తదుపరి చర్యలు ఏం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

# పవన్ తో పోటీకి మేం రెడీ

భీమవరం, జనవరి 28,భీమవరంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో .. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థ బీజేపీ కలయికతో రావాలని తీర్మానం చేసిన అంశంతో... బీజేపీ కూడా టీడీపీకి దగ్గరవుతోందన్న ప్రచారం ప్రారంభమయింది. దీనిపై విశాఖలో మీడియాతో మాట్లాడిన జీవీఎల్ నరసింహారావు .. ఆ ప్రచారాన్ని ఖండించారు. ప్రత్యామ్నాయ వ్యవస్థ బిజెపి కలయికతో రావాలి - అని చెప్పారు. కానీ కొందరు అప్పుడే దీనికి వక్రభాష్యాలు చెపుతున్నారని ఆరోపించారు. వైసీపీకి ప్రత్యామ్నాయ ప్రభుత్వం రావాలి. కానీ అది టిడిపి కాదు. భ్రమలు వద్దని స్పష్టం చేశారు. మేమూ జనసేనా కలిసే ఉన్నాము. ఈ విషయాన్ని మేమూ, జనసేనా చెపుతుంటే కాదు కాదని కొందరు ప్రచారం చేయటం ఏమిటని జీవీఎల్ నరసింహారావు ప్రశ్నించారు. వారసత్వ రాజకీయాలకు బిజెపి దూరమని జీవఎల్ ప్రకటించారు. కుటుంబమయం చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తే ఎలా అని ఆయన ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ఈ వారసత్వాల మీదే మా పోరు ఉంటుందని ప్రకటించారు. రాష్ట్రంలో హిందూ వ్యతిరేక వైఖరి పెరిగింది. తిరుమల దేవుడినించి భక్తులను దూరం చేస్తున్నారు. బిజెపి తప్ప ఎవరూ గొంతెత్తటం లేదన్నారు. మంగళవారం నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు మొదలవుతాయి. విశాఖ, ఉత్తరాంధ్ర అభివృద్ధి పనుల గురించి తన స్థాయిలో ప్రయత్నిస్తానన్నారు. అరకు రోడ్డు అభివృద్ధి గురించి నితిన్ గడ్కరీని అడుగుతాను. స్టీలు ప్లాంటు సమస్యలు, ఉత్తరాంధ్రలో ఇబిసి రిజర్వేషన్లు, మత్స్యకారుల సమస్యలు వంటివి ప్రస్తావిస్తామని తెలిపారు. అన్ని పెండింగు పనులూ పూర్తయేలా నావంతు కృషి చేస్తాను. స్థానిక అంశాలన్నీ నాకు తెలుసు. రానున్న రెండు నెలల్లో రాష్ట్ర సమస్యలు, విశాఖ సమస్యలు అన్నీ కేంద్ర దృష్టికి తీసుకు వెళతాం. వందేభారత్ విశాఖకు రావటం ఒక వరం. భవిష్యత్తులో మరిన్ని వందే భారత్ రైళ్లు వస్తాయి. విశాఖనుంచి తిరుపతి మీదుగా బెంగుళూరుకు ఒక వందేభారత్ కావాలని అడుగుతున్నామని తెలిపారు. పవన్ కల్యాణ్ చెబుతున్న విషయాలను ఎవరికి వారు అనుకూలంగా అర్థాలు తీసుకుంటున్నారని జీవీఎల్ విమర్శించారు. ఇటీవల వారాహి వాహనానికి పూజ చేసేందుకు పవన్ కల్యాణ్ .. తెలంగాణలో కొండగట్టు వెళ్లారు. అక్కడ తాము బీజేపీతోనే ఉన్నామని బీజేపీ కాదంటే... వేరే పార్టీలతో పొత్తుకు ప్రయత్నిస్తామన్నారు. అయితే ఆ వ్యాఖ్యలు తెలంగాణను ఉద్దేశించి చేశారని.. ఏపీ పొత్తులపై కాదన్న అభిప్రాయం ఉంది. కానీ పవన్ కల్యాణ్ మాత్రం ఈ విషయంలో స్పష్టత ఇవ్వలేదు. తర్వాతి రోజు మంగళగిరి పార్టీ ఆఫీసులో ఆయన మాట్లాడారు. అయితే బీజేపీతో పొత్తుల విషయంలో కొండగట్టులో చేసిన తరహా ప్రకటనలు చేయలేదు. అయితే ఓట్లు చీలనివ్వబోమని పదే పదే ప్రకటిస్తున్నారు., టీడీపీ అధినేతతో భేటీ అవుతున్నారు. అదే సమయంలో 2014 పొత్తులు కుదరవచ్చున్న ప్రచారమూ జరుగుతోంది. భీమవరం కార్యవర్గ సమావేశాల్లో బీజేపీ కూడా ... జనసేనతో పొత్తు విషయంపై క్లారిటీ ఇవ్వలేదు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థ బీజేపీ కలయికతో రావాలని తీర్మానం చేశారు. ఇది రకరకాల చర్చలకు కారణం అయింది. అందుకే టీడీపీతో పొత్తు ఉండదని జీవీఎల్ క్లారిటీ ఇచ్చారు.

## యధావిధిగా 30, 31 తేదీలలో బ్యాంకులు

హైదరాబాద్, జనవరి 28, (న్యూస్ పల్స్)జనవరి 30, 31 తేదీల్లో (సోమవారం, మంగళవారం) మీకు బ్యాంకులో ఏదైనా పని ఉంటే నిరభ్యంతరంగా బ్యాంకులకు వెళ్లవచ్చు. ఎందుకంటే, ఆ రెండు రోజుల్లో తలపెట్టిన బ్యాంక్ సమ్మె వాయిదా పడింది. ముంబైలో జరిగిన రాజీ సమావేశంలో యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్బీయూ) ఏకాభిప్రాయానికి రావడంతో.. జనవరి 30, 31 తేదీల్లో తలపెట్టిన రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెను అన్ని బ్యాంక్ యూనియన్లు వాయిదా వేశాయి.తమ డిమాండ్లపై బ్యాంకు యూనియన్లు జనవరి 31న చర్చిస్తాయని బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటాచలం చెప్పారు. జనవరి 31న యూనియన్లతో సమావేశం నిర్వహించేందుకు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ అంగీకరించిందని వెల్లడించారు. వారంలో ఐదు రోజుల బ్యాంకింగ్, పింఛను పెంపు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ అనే మూడు ఉమ్మడి అంశాల మీద జనవరి 31న చర్చించాలని శుక్రవారం జరిగిన రాజీ సమావేశంలో నిర్ణయించారు. ఇతర సమస్యల మీద సంబంధిత అధికారులు, కార్మిక సంఘాలతో విడివిడిగా చర్చిస్తామన్నారు.బ్యాంకు యూనియన్ల సమూహం యూఎఫ్బీయూ, తమ వివిధ డిమాండ్ల కోసం సమ్మె చేయాలని గతంలోనే నిర్ణయించింది. తమ డిమాండ్లను చాలా కాలం క్రితమే మంత్రివర్గం ముందు ఉంచినా, ఇప్పటి వరకు వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సీహెచ్ వెంకటాచలం ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు యూనియన్లు 5 రోజుల బ్యాంకింగ్ వర్కింగ్ కల్చర్‌తో పాటు అనేక డిమాండ్లు చేశాయి. పెన్షన్ అప్‌గ్రేడేషన్, ఇతర సమస్యలకు పరిష్కారం, నేషనల్ పెన్షన్ సిస్టమ్ రద్దు, వేతన సవరణ కోసం తక్షణమే చర్చలు ప్రారంభించడం, అన్ని కేడర్‌లలో ఖాళీల భర్తీ కోసం వెంటనే రిక్రూట్‌మెంట్ వంటి అనేక సమస్యలను బ్యాంక్ యూనియన్లు వెల్లడించాయి.

# జీవో అంటూ ప్రచారం..

విజయవాడ, జనవరి 28, ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పిందని సోషల్ మీడియాలో ప్రచారం నడుస్తోంది. రిటైర్‌మెంట్ ఏజ్‌ను 65 ఏళ్లకు పెంచిందని ఓ జీవో కూడా సర్క్యులేట్ అవుతోంది. జీవె? నెంబర్ 15ను జారీ చేసిందని సోషల్ మీడియా?లో తిరుగుతోంది. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఖండించింది?. ప్రభుత్వం ప్రతిష్టను దెబ్బ తీసేందుకే సోషల్ మీడియాలో ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రిటైర్‌మెంట్ ఏజ్ ఓ ఏడాది పెంచే ఆలోచన ప్రభుత్వంలో ఉందని తెలుస్తోంది. దీన్నే అడ్వాంటేజ్‌గా తీసుకొని ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసేందుకు వ్యతిరేకత క్రియేట్ చేసేందుకు ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని అధికారులు వివరించారు. సోషల్ మీడియాలో తిరుగుతున్న జీవోపై ఆర్థిక శాఖాధికారులు రియాక్ట్ అయ్యారు. అలాంటి ప్రపోజ్ ఏది కూడా ఇంతవరకు తమ శాఖకు రాలేదని... ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు యంత్రాంగం సిద్ధమైంది. ఇప్పటికే డీజీతో ఆర్థిక శాఖాధికారులు మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగల పదవీ విరమణ వయసుపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని... దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

# బాలయ్య క్యాలెండర్ ఈరన్న స్వామి సన్నిధిలో ఆవిష్కరణ

### తారకరత్న త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు



కౌతాళం :కర్నూలు జిల్లాలో వెలసిన పుణ్యక్షేత్రం శ్రీ శ్రీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయము నందు శనివారం రోజున నూతన సంవత్సరం 2023 శ్రీ నందమూరి బాలకృష్ణ అండ్ మోక్షజ్ఞ క్యాలెండర్ను నందమూరి అభిమానుల సమక్షంలో విడుదల చేశారు. శివగలం నారా లోకేష్ ప్రారంభించిన పాదయాత్రలు సొమ్మసిల్లి పడిపోయిన నందమూరి తారకరత్న త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం నూట ఒక్క టెంకాయలు కొట్టడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉరుకుంద నరసింహులు గవిగట్టు బజారి కౌతాళం రహిమాన్ ,ఎరిగేరి భీమన్న , గవిగట్టు మూకయ్య, పెద్దతుంబలం నాగరాజు ,బొంపల్లి వీరేష్ ,దిద్ది ఈరన్న ,కల్లుకుంట లక్ష్మయ్య, కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బద్వేల్ లో ఘనంగా రథసప్తమి వేడుకలు

### వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ గోవింద్ రెడ్డి

బద్వేలు బద్వేల్ నియోజకవర్గం వ్యాప్తంగా శనివారం రథసప్తమి వేడుకలు ఎంతో ఘనంగా జరిగాయి అన్ని దేవాలయాలు ఈ వేడుకలు రంగ రంగ వైభవంగా నిర్వహించారు ఆలయాలకు భక్తులు కుటుంబాలతో సహా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాకులు చర్యలు తీసుకున్నారు ఆలయాల్లో భక్తులకు అన్న ప్రసాదం చేశారు కాగా స్థానిక నెల్లూరు రోడ్డులో వెలిసిన శ్రీ లక్ష్మి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన రథసప్తమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వైకాపా ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి పాల్గొన్నారు ఆయనతోపాటు బద్వేల్ మున్సిపల్ చైర్మన్ వాక మల్ల రాజగోపాల్ రెడ్డి బద్వేల్ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రమణారెడ్డి మరికొందరు వైకాపా నాయకులు కార్యకర్తలు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు



# మానవత్వం చాటుకున్న నాయకులు అడివప్ప గౌడ్



### విబాహానికి 5,000 రూపాయలు ఆర్థిక సాయం చేసిన అడివప్ప గౌడ్ ...

### నూతన దంపతులు ఆశీర్వదించిన తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్

కౌతాళం : :మండలంలోని కాత్రికిలో జరిగిన వివాహానికి 5,000 రూపాయలు తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్పగౌడ్ ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలో ఎవరైనా ఆపదలో గాని, కష్టాల్లో గాని ఉన్నారంటే నేను ఉన్నానంటూ ముందుకు వచ్చి సహాయం చేసే మనస్తత్వం ఉన్న మంచి మనసున్న నాయకుడు అడివప్ప గౌడ్. అనంతరం కాత్రికి గ్రామానికి చెందిన చిదానంద స్వామి కుమారుడు విగ్నేష్ స్వామి వివాహానికి ముఖ్య అతిథిగా తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్ హాజరయ్యారు. నవ దంపతులను రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాత్రికి మాజీ సర్పంచ్ చంద్ర, ఎంపిటిసి బంగారయ్య మరియు ఇతరులు పాల్గొన్నారు.

# నంద్యాల రూరల్ లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి...




నంద్యాల్ :-నంద్యాల మండలంలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. కోర్టులో కేసు పేరుతో జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నంద్యాల మండల సమితి ఆధ్వర్యంలో పేదలతో కలిసి స్థానిక సిపిఐ కార్యాలయం నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆందోళన నిర్వహించారు.అనంతరం తహసిల్దార్ కార్యాలయం ముందు జరిగిన ఆందోళన కార్యక్రమాని సంఘం జిల్లా అధ్యక్షులు ఏ సుబ్బరాయుడు అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె రాధాకృష్ణ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మందికిపైగా ఇంటి పట్టాలు పంపిణీ చేశామని, గొప్పలు చెప్పుకుంటున్నారు. అయితే ఇంతమంది ఇండ్లు లేని పేదలు ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఎక్కడ వచ్చిందని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నంద్యాల మండలంలో వందల ఎకరాల ప్రభుత్వ భూములను అధికార పార్టీకి సంబంధించిన నాయకులు

### కోర్టులో కేసు పేరుతో జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల ఇవ్వకుంటే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తాం...

### ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం..

ప్రజాప్రతినిధులు భూ కబ్జాలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్న రెవెన్యూ అధికారులకు ఎ మాత్రం కనపడటం లేదన్నారు. అయితే పేదలకు ఒకటిన్నర సెంటు స్థలం ఇవ్వమంటే ప్రభుత్వం స్థానిక రెవిన్యూ అధికారులు మాత్రం అనేక కొత్త కొత్త నిబంధనలు విధించడం చాలా సిగ్గుచేటన్నారు. నంద్యాల మండలంలోని ఇండ్లు లేని పేద ప్రజలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయకపోతే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములను గుర్తించి భూ పోరాటాల ద్వారా పేదలకు పంపిణీ చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు..×నంద్యాల మండలం అర్బన్ ప్రాంతాలలో దాదాపు 12 వేల మందికిపైగా జగనన్న కాలనీ పేరుమీద లబ్ధిదారులను ఎంపిక చేశారు, కానీ వారు గుర్తించిన భూమి కోర్టులో కేసు పేరుతో పేదలకి ఇంటి స్థలం ఇవ్వడం లేదని దీనిపై నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర రెడ్డి గారు వెంటనే పరిష్కారం చేయాలని లేని పక్షంలో ప్రభుత్వం గుర్తించిన లబ్ధిదారులను సమీకరించి ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.ఫిబ్రవరి 6న నంద్యాల కలెక్టర్ కార్యాలయం దగ్గర జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమం చేపట్టి అర్జీలు అందిస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నంద్యాల పట్టణ కార్యదర్శి ప్రసాద్ సహకార్యదర్శి సోమన్న ఏఐటిసి పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మహమ్మద్ భాష వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీదేవి, గోస్పాడు మండల కార్యదర్శి హరినాథ్, సిపిఐ జిల్లా సమితి సభ్యురాలు నారాయణమ్మ, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు. జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ తదితరులు పాల్గొన్నారు..

# కోదండరామాలయం లో రథసప్తమి వేడుకలు





నంద్యాల :- నంద్యాల పట్టణంలో కోదండరామాలయం లో శ్రీ భగవత్ సేవ సమాజ్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం నాడు రథసప్తమి సందర్భంగా కోదండరామాలయ ప్రాంగణంలో వెలసిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో లోక కళ్యాణం కోసం ప్రతి సంవత్సరం జరిగే. సూర్య ఆరాధన, సూర్య నమస్కారాలు,సూర్య భగవానునికి. ఆర్ఘ్యం మరియూ అరుణ హోమం మిక్కిలి ప్రీతికరం. అన్ని కార్యక్రమాలు అత్యంత సాంప్రదాయ రీతిలో జరిగాయి. శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ ధన్వంతరీ, శ్రీ నవగ్రహ, శ్రీ సుదర్శన, అరుణ హోమం ఎంతో విశేషనీగా అనేక భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగాయి .తదనంతరం స్వామి వారికి దివ్య మంగళ హారతులు సమర్పించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# అంగరంగ వైభవంగా రథసప్తమి వేడుకలు

శ్రీకాకుళం ప్రముఖ పుణ్యక్షేత్రం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాదాయ శాఖ కమీషనర్ హరిజవహర్ లాల్ ఈ వేడుకలకు అంకురార్పణ చేసి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం క్షీరాభిషేకం నిర్వహించి ఆదిత్యుని నిజరూపానికి వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. ఈ ఉత్సవాలను సంప్రదాయ బద్ధంగా జరిపించడానికి జిల్లా యంత్రంగం అన్ని ఏర్పాట్లను చేసింది. రథసప్తమి రోజున స్వామి వారిని దర్శించుకుంటే రోగ శోక బాధలన్నీ తొలిగిపోతాయని భక్తుల విశ్వాసం.


# హాలీడే రోజు కూడా పెరగని బాలయ్య బాబు కలెక్షన్లు..!

నటసింహం నందమూరి బాలకృష్ణ నటించిన తాజా సినిమా వీర సింహారెడ్డి బాక్సాఫీసు వద్ద ప్రభంజనం సృష్టించింది. సంక్రాంతి పండుగకు రిలీజైన ఈ సినిమాను మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని తెరకెక్కించారు. అఖండ సినిమాతో భారీ సక్సెస్ సాధించిన ఆయన అదే ఊపులో వీర సింహారెడ్డితో కూడా హిట్ కొట్టారు.సినిమా విడుదలైన మొదటి వారం భారీ వసూళ్లను సాధించిన ఈ చిత్రం... రెండో వారం కాస్త డల్ అయింది. ముఖ్యంగా జనవరి 26వ తేదీ(హాలీ డే) రోజు కూడా పెద్దగా సినిమా ఆడకపోవడం.. బాలయ్య అభిమానుల్లో కాస్త నిరాశ కల్గించింది.మొదటి వారం కంటే రెండో వారంలో భారీగానే వసూళ్లు తగ్గిపోగా.. 26వ తేదీ రోజు పెరుగుతాయని అందరూ భావించారు. హాలీ డే కావడం వల్ల సినిమాను ఎక్కువ మంది చూస్తారేమో అనుకున్నారు. కానీ ఆరోజు కూడా వసూళ్లు ఎక్కువగా పెరగలేకపోయాయి. మొత్తం పదిహేను రోజుల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి వీర సింహారెడ్డి 65.16 కోట్ల బిజినెస్ చేసింది. కర్ణాటకతో పాటు దేశంలోని మిగతా ప్రాంతాల్లో 4.78 కోట్ల రూపాయల వసూళ్లను సాధించింది. ఓవర్సీస్ లో 5.78 కోట్లు రాబట్టగా... ప్రపంచ వ్యాప్తంగా రూ.75.68 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. కానీ 15వ రోజు మాత్రం కేవలం రూ. 26 లక్షల వసూళ్లను మాత్రమే రాబట్టుకోగల్గింది.15 రోజుల్లో ఈ సినిమా నైజాంలో రూ.16.80 కోట్లు సీడెడ్ లో రూ.16.25 కోట్లు ఉత్తరాంధ్రలో రూ.8.51 కోట్లు తూర్పు గోదావరిలో రూ.5.53 కోట్లు పశ్చిమ గోదావరిలో రూ..15 కోట్లు గుంటూరులో రూ.6.32 కోట్లు కృష్ణాలో రూ.4.66 కోట్లు నెల్లూరులో రూ.2.94 కోట్లతో కలిపి రూ.. 65.16 కోట్ల షేర్ రూ. 105.50 కోట్లు గ్రాస్ వసూలు అయింది.బాలయ్య బాబు గోపీచంద్ కలయికలో వచ్చిన వీర సింహారెడ్డి సినిమా అంచనాలకు అనుగుణంగానే ప్రపంచ వ్యాప్తంగా రూ.73 కోట్ల మేర బిజినెస్ జరిగినట్లు ట్రేడ్ వర్గాలు ప్రకటించాయి. దీంతో బ్రేక్ ఈవెన్ టార్గెట్ రూ.74 కోట్లుగా నమోదు అయింది. ఇక 15 రోజుల్లో ఇందుకు మొత్తంగా 75.68 కోట్లు వచ్చాయి.




# పవన్ ఫ్యాన్స్ కి మరో సర్ ప్రైజ్ ఇవ్వబోతున్నాడా?

పవర్ స్టార్పవన్ కల్యాణ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ వాటిని మొదలు పెట్టేస్తున్నాడు. ప్రస్తుతం జనసేన పార్టీ కార్యకలాపాల్లో పాల్గొంటూ క్రియాశీలక రాజకీయాల్లో బిజీగా గడిపేస్తూనే మరో పక్క వరుస సినిమాలని లైన్ లో పెట్టేస్తున్నాడు. ఇటీవలే రాజకీయ ప్రచారం కోసం వారాహిని రెడీ చేయించి దానకి కొండగట్టుతో పాటు విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించిన విషయం తెలిసిందే.క్రిష్ జాగర్లమూడితో చేస్తున్న తొలి పాన్ ఇండియా మూవీ 'హరి హర వీరమల్లు'ని పూర్తి చేసే పనిలో వున్న పవన్ ఇది పూర్తి కాకుండానే వరుసగా క్రేజీ ప్రాజెక్ట్ లని ప్రకటిస్తూ అభిమానుల్ని సర్ ప్రైజ్ చేస్తున్నాడు. ఇటీవలే 'భవదీయుడు భగత్ సింగ్' ప్లేస్ లో 'తేరీ' రీమేక్ ఆధారంగా హరీష్ శంకర్ దర్శకత్వంలో 'ఉస్తాద్ భగత్ సింగ్' ని లాంఛనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభించిన పవన్ కల్యాణ్ ఆ వెంటనే 'సాహో' ఫేమ్ సుజీత్ డైరెక్షన్ లో ఓ భారీ గ్యాంగ్ స్టర్ మూవీకి శ్రీకారం చుట్టబోతున్నట్టుగా ప్రీ లుక్ పోస్టర్ ని విడుదల చేసిన విషయం తెలిసిందే. డీవీవీ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై డీవీవీ దానయ్య ఈ భారీ గ్యాంగ్ స్టర్ మూవీని నిర్మించబోతున్నారు. అరుణవర్ణమైన పోస్టర్ .. మధ్యలో సూరీడు.. దే కాల్ హిమ్ ఓజీ' అనే ట్యాగ్ లైన్... జపాన్ టు ముంబై కి సంబంధించిన సింబల్స్.. మధ్యలో పవన్ షాడో.. గన్ ని తలపిస్తూ కనిపించిన తీరుతో ప్రీ లుక్ పోస్టర్ తో పవన్ ఫ్యాన్స్ కు సర్ ప్రైజ్ ఇచ్చాడు.పోస్టర్ ఎడ్జ్ లో ఫర్ స్టోర్మ్ ఈజ్ కమింగ్ అంటూ చిన్న క్యాప్షన్ ఇవ్వడంతో పవన్ ఫ్యాన్స్ ఈ మూవీ పాన్ ఇండియా రేంజ్ లో తెరపైకి రానుందని ఇందులో పవన్ ని సుజీత్ ఓ రేంజ్ లో ప్రజెంట్ చేయబోతున్నాడని సంబరాలు జరుపుకున్నారు.పవన్ కు స్వతహాగా వీరాభిమాని అయిన సుజీత్ ఈ మూవీని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరపైకి తీసుకురావాలనే ఆలోచనలో వున్నాడట. కాకుండా తన కెరీర్ కు అత్యంత ప్రస్టీజియస్ ప్రాజెక్ట్ గానూ దర్శకుడిగా తన కెరీర్ ని నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్లే ప్రాజెక్ట్ గానూ భారీ అంచనాలే పెట్టుకున్నాడని చెబుతు న్నారు. ఇదిలా వుంటే ఈ మూవీని ప్రకటించి దాదాపు నెల దాటి పోయింది. ఈ నేపథ్యంలో ఈ మూవీ నుంచి సర్ ప్రైజ్ అప్ డేట్ రాబో తోంది.ఈ మూవీని జనవరి 30న పూజా కార్యక్రమాలతో ప్రారంభిం చనున్నట్టుగా తెలుస్తోంది. ఇందులో నటించే హీరోయిన్ విలన్ గా ఎవరిని దించబోతున్నారు అనే పూర్తి వివరాలు ఆ రోజే చిత్ర బృందం అధికారికంగా ప్రకటించబోతోందని పవన్ సుజీత్ ల కాంబినేషన్ లో పాన్ ఇండియా మూవీగా ఈ సినిమాని అత్యంత భారీ బడ్జెట్ తో భారీ స్థాయిలో నిర్మించబోతున్నారని ఇన్ సైడ్ టాక్.




# 'రైటర్ పద్మభూషణ్' మేకర్స్ డేరింగ్ స్టెప్

ఈ మధ్య బ్యాక్ టు బ్యాక్ సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. అందులో ఎన్ని ఆడుతున్నాయో ఎన్ని జనాల్లోకి వెళుతున్నాయో అందరికీ తెలిసిందే. పది రిలీజ్ అయితే అందులో రెండు మాత్రమే జనాలని ఆకట్టుకుంటున్నాయి. వారి ఆదరణ పొందుతున్నాయి. అయితే ఇందు కోసం మేకర్స్ పెదద యుద్ధమే చేయాల్సి వస్తోంది. ఓ సినిమాని నిర్మించడానికి ఎంత పెద్ద కసరత్తు చేస్తున్నారో దాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లడానికి కూడా అంతే స్థాయిలో కసరత్తు చేయాల్సి వస్తోంది.ఈ నేపథ్యంలో ఓ యంగ్ టీమ్ తాము నిర్మించిన సినిమాని జనాల్లోకి తీసుకెళ్లడానికి వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింటి. 'కలర్ ఫొటో' ఫేమ్ సుహాస్ కథానాయకుడిగా నటించిన లేటెస్ట్ మూవీ 'రైటర్ పద్మభూషణ్'.సుహాస్ తో షార్ట్ ఫిలింస్ నిర్మించడమే కాకుండా ఇటీవల సూపర్స్టార్ మహేష్ మహేష్ బాబు నిర్మాణ భాగస్వామ్యంలో 'మేజర్' మూవీని నిర్మించిన శరత్ చంద్ర అనురాగ్ రెడ్డి మరో వ్యక్తి చంద్రు మనోహరన్ తో కలిసి ఈ 'రైటర్ పద్మభూషణ్'ని ఛాయ్ బిస్కెట్ సినిమాస్ లహరి ఫిలింస్ బ్యానర్ ల పై నిర్మించారు.శణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వం వహించిన ఈ మూవీని ఫిబ్రవరి 3న భారీ స్థాయిలో రిలీజ్ చేస్తున్నారు. కమెడియన్గా క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా పేరు తెచ్చుకురన్న సుహాస్ 'కలర్ ఫొటో'తో మంచి గుర్తింపుని సొంతం చేసుకున్నాడు. తను హీరో అంటే సినిమా కోసం ఆడియన్స్ థియేటర్లకి వస్తారా? అనే అనుమానం సహజమే. అందుకే ఈ మూవీ కోసం ప్రేక్షకుల్ని థియేటర్లకు రప్పించడం కోసం మేకర్స్ వినూత్న ప్రయత్నానికి తెర లేపారు.ఏదైనా సినిమా రిలీజ్ అవుతోందంటే ఒక రోజు ముందు ప్రీమియర్స్ వేయడం సహజం. అయితే 'రైటర్ పద్మభూషణ్' కు కోసం ఆ ఫార్ములాని బ్రేక్ చేస్తూ మేకర్స్ ఏకంగా ఐదు సిటీస్ లలో ఫ్యామిలీస్ కోసం జనవరి 27 నుంచి ఫిబ్రవరి 1 వరకు ప్రత్యేక ప్రీమియర్ షోలని ఏర్పాటు చేశారు. 27న విజయవాడలో 28న గుంటూరులో 29న భీమవరంలో 30న కాకినాడలో 31న వైజాగ్ లో ఫిబ్రవరి 1న హైదరాబాద్ లో ప్రత్యేకంగా ఫ్యామిలీస్ కోసం షోలు వేస్తున్నారు.దీంతో 'రైటర్ పద్మభూషణ్' హాట్ టాపిక్ గా మారింది. మేకర్స్ కాన్ఫిడెన్స్ కి తగ్గట్టుగా ఫ్యామిలీస్ నుంచి రెస్పాన్స్ లభిస్తే మాత్రం ఈ మూవీ ఖచ్చితంగా హిట్ అనిపించుకోవడం గ్యారెంటీ అవే కామెంట్ లు వినిపిస్తున్నాయి. గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ఈ మూవీని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేస్తోంది.




# డబుల్ సెంచరీ ఓకే! టీ20లలో మరీ ఇంత ఘోరమా? అయినా ఇదెక్కడి న్యాయం




బంగ్లాదేశ్తో వన్డేలో ద్విశతకం బాది సంచలన రికార్డులు సృష్టించిన టీమిండియా యువ ఓపెనర్ ఇషాన్ కిషాన్ గత కొన్నాళ్లుగా టీ20 ఫార్మాట్లో మాత్రం తేలిపోతున్నాడు.స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్నాడు. ఈ వికెట్ కీపర్ బ్యాటర్ గత 12 ఇన్నింగ్స్ స్కోర్లు పరిశీలిస్తే పరిస్థితి అర్థమవుతుంది.గత కొన్నాళ్లుగా ఇషాన్కు అంతర్జాతీ టీ20లలో ఒక్కటంటే ఒక్క హాఫ్ సెంచరీ కూడా లేదు. తాజాగా న్యూజిలాండ్తో స్వదేశంలో మొదటి టీ20లోనూ అతడు విఫలమయ్యాడు. రాంచి మ్యాచ్లో మరో యువ బ్యాటర్ శుబ్మన్ గిల్తో కలిసి ఓపెనర్గా బరిలోకి దిగిన ఇషాన్ కిషన్ 4 పరుగులకే పెవిలియన్ చేరాడు. సొంత మైదానంలో మిచెల్ బ్రాస్వెల్ బౌలింగ్లో అవుటయ్యాడు. దీంతో టీ20లలో అతడి వైఫల్యం మరోసారి బయటపడింది.ఈ నేపథ్యంలో ఇషాన్ కిషన్పై విమర్శలు వస్తున్నాయి. "డబుల్ సెంచరీ సంగతి మర్చిపో. ఇకనైనా బ్యాటింగ్పై మరింత దృష్టి పెట్టు. ఇలా అయితే జట్టులో చోటెలా దక్కుతుంది" అంటూ అభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఇక కొంత మంది నెటిజన్లు.. సంజూ శాంసన్, పృథ్వీ షా పేర్లను ప్రస్తావిస్తూ.. "సంజూ, పృథ్వీ ఆటలో నిలకడలేదని పక్కన పెడతారు. అదే ఇషాన్ మాత్రం ఫెయిల్ అవుతున్నా అవకాశాలు ఇస్తారు. ఇదెక్కడి న్యాయం" అంటూ బీసీసీఐ సెలక్టర్ల తీరును తప్పుబడుతున్నారు.మరికొంత మందేమో.. "ఏకంగా రూ. 15 కోట్లకు పైగా ఖర్చు పెట్టి నిన్ను కొన్న ముంబై ఇండియన్స్ ఇక తలపై తడిగుడ్డ వేసుకోవాల్సిందే. మరీ ఇంత ఘోరంగా ఆడతావనుకోలేదు ఇషాన్" అంటూ ట్రోల్ చేస్తున్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**